ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | Friday 11 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 150 | Vol.No 28 Issue No .150 | www.visionandhra.in

## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

- అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకుంటోంది
- అధికారం పోయినా అహంకారం పోలేదు
- వారి కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలి
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది
- కాంగ్రెస్‌కు నష్టం చేసేందుకు కుట్రలు
- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం!
- సభ్యుల పనితీరే గెలుపునకు మూలం
- తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం
- సర్‌పై అందరూ అప్రమత్తంగా ఉండండి
- సీఎల్పీ సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలు
- ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- అసెంబ్లీ ఘటనపై సర్కార్ ఫ్లాష్ సర్వే..



హైదారాబాద్, సెప్టెంబర్ 10 : తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం.. ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర మిగతా 2లో..

## కొండల్ రెడ్డికి అక్రమకేటాయింపులు

- నిబంధనలకు విరుద్ధంగా భూముల కేటాయిపు
- 200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని ఇచ్చారు
- ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాం
- ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు
- బినామీ కంపెనీల లబ్ధికోసమే సిఎం పనిచేస్తున్నారు
- 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్'తో అక్రమ ఒప్పందాలు
- ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో అంత దోపిడీ
- సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి
- వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోన్న ప్రభుత్వం
- నిజాయతీ ఉంటే వెంటనే కేంద్రం స్పందించాలి
- సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలికితీయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- రేవంత్ రెడ్డికి సొంత ఊరి నుంచే కౌంట్‌డౌన్ షురూ
- ఫ్యూచర్ సిటీలో కొండల్ రెడ్డి భూముల పరిశీలన
- ఫ్యూచర్ సిటీ భూముల వద్ద తీవ్ర ఉద్రిక్తత..




- కేటీఆర్, హరీశ్ రావు ఆధ్వర్యంలో భారీ నిరసన!

హైదారాబాద్, సెప్టెంబర్ 10 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మిగతా 2లో..

## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

- రూ.5 లక్షల ఉచిత సాయం.. తెలంగాణలోనే అమలు
- రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు
- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు
- ఎంపికలో డ్రాలో పారదర్శకత.. అనర్హులకు చోటు లేదు
- 8 లక్షల ఇళ్లకు ప్రభుత్వంపై సుమారు రూ.40 వేల కోట్ల భారం
- పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



హైదారాబాద్, సెప్టెంబర్ 10 : పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30-40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని మిగతా 2లో..

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం
- పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు
- తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం
- రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదారాబాద్, సెప్టెంబర్ 10 : గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద మిగతా 2లో..

## 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి
- సంబంధిత శాఖల అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



హైదారాబాద్, సెప్టెంబర్ 10 : 2026-27 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా మిగతా 2లో..

## నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

- పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు,
- 2,000కు పైగా కంపెనీలతో ఎకోసిస్టమ్,
- వ్యాక్సిన్ల తయారీలో గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్,
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు,
- లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల్లో నూతనాధ్యాయం,
- ఎంఎస్‌డీ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

హైదారాబాద్, సెప్టెంబర్ 10 : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఈ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌డీ డిజిటల్ హ్యూమన్ హెల్త్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రితేష్ శ్రీవాస్తవ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేశ్ సింగ్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు మిగతా 2లో..




## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

- ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల,
- 796.28 ఎకరాల భూమి కేటాయింపు



హైదారాబాద్, సెప్టెంబర్ 10 : తెలంగాణ రవాణా రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతిష్ఠాత్మక అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బుల్లెట్ ట్రైన్ హబ్‌కు మొదటి అడుగు పడింది. హైదరాబాద్ మహా నగరాన్ని దేశంలోనే మొట్టమొదటి మిగతా 2లో..

## కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి

- కూరగాయల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యం..
- కూరగాయలు ఇతర రాష్ట్రాలకు వెళ్లేలా కార్యాచరణ
- లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక
- సాగుకు అవసరమైన సదుపాయాలపై భారీగా రాయితీలు..
- కూరగాయల సాగుకు రూ.125 కోట్లకుపైగా కేటాయింపులు
- పామాయిల్‌తో పాటు అంతర పంటలకు ప్రోత్సాహం..
- ప్రమాణాలు పాటించని కలాశాలపై కఠిన చర్యలు
- కొత్త వ్యవసాయ కళాశాలల ఏర్పాటు, సీట్ల పెంపు
- శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి తుమ్మల

మిగతా 2లో..



## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి




హైదారాబాద్, సెప్టెంబర్ 10 : హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ మిగతా 2లో..




## టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

- రాష్ట్ర పార్టీ హోదా కల్పిస్తూ ఈసీ నిర్ణయం

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 : ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ మిగతా 2లో..

## రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి

- ఆలోచనలతో పాటు... అమలూ ఉండాలి
- వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర
- రియాక్టివ్ నుంచి ప్రో యాక్టివ్ దిశగా అధికారులు పనిచేయాలి
- జిల్లాకు 25, నియోజకవర్గానికి 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, సెప్టెంబర్ 10 : శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ మిగతా 2లో..

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల)కు గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారని తెలిపారు.

## 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026-27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. 2026-27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుం దని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదా ములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగో లు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వ యం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీ.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథా విధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

హైస్పీడ్ బుల్లెట్? ట్రైన్ కనెక్టివిటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బుల్లెట్? ట్రైన్? హబ్?ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో భారీ ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్ పేరిట (సమీకృత సమగ్ర రవాణా కేంద్రం) ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మెగా మల్టీ మోడల్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు అధికారికంగా ప్రారంభించారు. ఈ భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కోసం శంషాబాద్-తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ పరిధిలో 796.28 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఈ ప్రక్రియ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం సేకరిస్తున్న మొత్తం స్థలంలో సర్వే నంబర్లు 28, 62 పరిధిలోని 750 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 46.28 ఎకరాలు ప్రైవేటు, పట్టా భూములుగా అధికారులు గుర్తించారు. నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు లేదా ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు చేపట్టరాదని రెవెన్యూ యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొంది. సీఎం రేవంత్ రెడ్డి సరిగ్గా ఆరు నెలల క్రితం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. విమానాశ్రయ రన్‌వేకు అత్యంత సమీపంలో ఉండటం వల్ల భవిష్యత్తులో విమాన ప్రయాణికులు నేరుగా బుల్లెట్ రైలు సేవలను వినియోగించుకోవడానికి వీలవుతుంది. ఈ బహదూర్‌గూడ హబ్ కేంద్రంగా హైదరాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై (వయా అమరావతి) వంటి మూడు ప్రధాన హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్ల కార్యకలాపాలను నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు తగ్గిపోనుంది.

## నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగం పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా నూతన శకంలోకి అడుగుపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 2,000కు పైగా కంపెనీలతో సంపూర్ణమైన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ఉందని, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని తెలిపారు. అంతేకాకుండా అమెరికా వెలుపల అత్యధిక యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కేవలం ఔషధ తయారీకే పరిమితం కాకుండా అధునాతన ఆర్ అండ్ డీ), గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల దిశగా దూసుకుపోతోందని చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఆమ్జెన్, ఎలీ లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' ద్వారా డ్రగ్ డిస్కవరీ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, క్లినికల్ రీసెర్చ్ మరియు అత్యాధునిక టెక్నాలజీల అనుసంధానానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఏర్పాటైన 75కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తోడుగా, త్వరలోనే జీసీసీల సంఖ్యను 100కు చేరుస్తామని, దీనిద్వారా దాదాపు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. అంతేకాకుండా భారత్ ఫ్యూచర్ సిటీలో 2,100 ఎకరాల లైఫ్ సైన్సెస్ జోన్, ప్రత్యేకంగా 100 ఎకరాల్లో బయోలాజిక్స్ హబ్‌తో పాటు 1బయో మోడల్ మౌలిక వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంఎస్‌డీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డిజిటల్ సామర్థ్యాలను విస్తరించేందుకు హైదరాబాద్‌లో విస్తారమైన ప్రతిభ, అత్యుత్తమ టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయని, అందుకే ఈ నగరాన్ని ఎంచుకున్నామని తెలిపారు. ఈ నూతన కేంద్రం ద్వారా డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), ఇంజినీరింగ్ సాంకేతికతలతో ప్రపంచవ్యాప్తంగా మానవ మరియు జంతు ఆరోగ్య రక్షణకు అవసరమైన పరిష్కారాలను అందిస్తామని సంస్థ స్పష్టం చేసింది. జీనోమ్ వ్యాలీతో పాటు ఐఐసీటీ, సీసీఎంబీ, నైపర్ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉండటం హైదరాబాద్‌కు మరింత బలాన్ని చేకూరుస్తోందని నేతలు వివరించారు.

## రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి

ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.సేవల్లో నాణ్యత పెంచాలి. గతంలో 50 ఏళ్లలో చేసే అభివృద్ధిని ఇప్పుడు 10-15 ఏళ్లలో నే సాధించేందుకు ఆస్కారం ఉంది. మనకు వనరులు ఉన్నాయి. టెక్నాల జీ అందుబాటులో ఉంది. అవకాశాలను అన్ లాక్ చేయండి... అభివృ ద్ధి సాధించండి"మనకు ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయగలి గాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10-15 ప్రాజెక్టుల ను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశా లను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయా లని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పం దించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి... మం చి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రో యాక్టివ్ గవర్నెన్స్ ఉండాలి. ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అంటే అభివృద్ధి- పాలన పెండింగ్ లో ఉన్నట్టే. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందినప్పుడే ప్రజల నుంచి సానుకూల స్పందన ఉంటుంది. నాకు పరిపాలన కంటే సుపరిపాలన ముఖ్యం. మంత్రులు, అధికారులు, కలెక్టర్లు ప్రభుత్వ సేవలు అందించే విషయంలో.. అభివృద్ధి సాధించే విషయంలో పోటీ పడాలి."అని ముఖ్యమంత్రి వివరించారు.

నెలవారీ నివేదికలతో అభివృద్ధి ప్రయాణం

"ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేసి ఎప్పటికప్పుడు లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకూ జీఎస్డీపీని కూడా లెక్కిం చి ప్రగతిలో ఎక్కడ ఉన్నామో చూస్తున్నాం. 2022-23 బేస్ ఇయర్ గా ప్రస్తుత ధరలకు అనుగుణంగా 13.44 శాతం వృద్ధి రేటు నమోదైంది. తయారీ రంగంలోనూ అభివృద్ధి నమోదు అయ్యింది. జీఎస్టీ వసూళ్లు కూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.25,450 కోట్ల మేర పెరిగా యి. రెవెన్యూ శాఖలో సంస్కరణల్ని అమలు చేస్తున్నాం. 120 ఏళ్ల నాటి భూ సమస్యల్ని కూడా పరిష్కరిస్తున్నాం. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేసే బాధ్యత మనందరిది. పాలన అంటే గుడ్డిగా పనిచేయటం కాదు. వినూత్న ఆలోచనలు చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలి. బెస్ట్ పాలసీలు తెచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేయాలి. కొత్త ఆలోచన- కొత్త ఆవిష్కరణలతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రస్తుతం 13.44 శాతం వృద్ధి నమోదైంది. దీనిని 15 శాతం దిశగా తీసుకెళ్దాం." అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

ఇద్దరు మహిళా అధికారులకు సీఎం ప్రశంసలు

'డీఎస్సీ-2025లో ఎక్కడా తప్పు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలిచ్చాం. కానీ కొందరు అదే పనిగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దీనిపై ఇద్దరు మహిళా అధికారులు చక్కగా స్పందించి కౌంటర్ ఇచ్చారు... వారిని అభినందిస్తున్నా. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో కారణంగా నీటి భద్రత ఓ సవాలుగా మారింది. 54 శాతం లోటు వర్షపాతం ఈసారి రాష్ట్రంలో నమోదైంది. గతేడాది ఇదే సమయానికి రిజర్వాయర్లలో 85 శాతం నీటి నిల్వలు ఉంటే ఈసారి మాత్రం 57 శాతం మాత్రమే ఉన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం లాంటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జల్ జీవన్ లాంటి మిషన్ను గత ప్రభుత్వం సరిగ్గా వినియోగించుకోలేదు. తాగు నీటి సరఫరా విషయంలో ఎలాంటి రాజీ లేదు. పీఎండీఎస్, ప్రకృతి సేద్యం ద్వారా ప్రతీ ఎకరానూ సాగులోకి తీసుకురావాలి. సంక్షోభంలోనే కలెక్టర్ల నాయకత్వం వెలుగు చూడాలి."అని సీఎం చంద్రబాబు అన్నారు.

## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని.. బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం.. ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించారని.. మహిళా పోలీసు అధికారుల ఎదుట టీషర్టులు విప్పడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. అలాగే శాసనసభాపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను ఎదుర్కొని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి అభినందించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజలు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించినట్లు తెలుస్తోంది. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని.. వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. పోలీసు సిబ్బందిపై జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసు అధికారుల్లో రేవంత్‌రెడ్డి కనిపించినట్లుగా ఉందని, అందుకే వారిపై అంత ఆగ్రహంతో వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో కులగణన ద్వారా వచ్చిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులు విస్తృతంగా మాట్లాడాలని సీఎం సూచించినట్లు సమాచారం. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. దేశంలో వయోజనుల జనాభా, ఓటర్ల జాబితాలో నమోదైన ఓట్ల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పలు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. అయితే ఈ అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలేనని.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన తుది నిర్ణయాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు విస్తృతంగా వివరించాలని, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. వెయ్యి రోజుల పాలనలో ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

## కొండల్ రెడ్డికి అక్రమకేటాయింపులు

సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వాయ్‌తో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట్ సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి సమీపంలోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనిమాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు మెరుపు ధర్నాకు దిగడం, ట్రాక్టర్లతో రాస్తారోకో చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతూ రేవంత్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. పంటలు ఎండిపోతుంటే రైతులు రోడ్డెక్కారు.. కానీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు 24 గంటల కరెంట్ హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు 6--8 గంటల విద్యుత్ కూడా సరఫరా చేయకపోవడం శోచనీయమని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి గోడును పట్టించుకోకుండా చోద్యం చూడడం విడ్డూరమని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత గ్రామానికి కూతవేటు దూరంలోనే రైతులు కరెంట్ కోసం జాతీయ రహదారిపైకి రావాల్సి పరిస్థితిని వస్తే దాన్ని 'ప్రజా పాలన' అంటారా? అని నిలదీశారు. సొంత ఇలాకాలోని రైతుల సమస్యలే పరిష్కరించలేని సీఎం , తెలంగాణలోని లక్షలాది మంది రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన 'మార్పు' . రైతుల ఆక్రందన రేవంత్ రెడ్డికి వినిపించడం లేదా ? ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మొద్దునిద్ర వీడి రైతుల పొలాలకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణంలో ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310--320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో ఈ విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వదిలిన ఇళ్లకు సుమారు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు. అసంపూర్తి ఇళ్లకు రెండో విడతలో ప్రత్యేక అవకాశం గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని, డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి

హైదారాబాద్, సెప్టెంబర్ 10: తెలంగాణలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తిరిగి పెంచడంతో పాటు రైతులకు ఆధునిక సాంకేతికత, నాణ్యమైన ఇన్‌పుట్స్, సాగునీటి సదుపాయాలు, శిక్షణ, ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్, మార్కెటింగ్ వంటి అన్ని రంగాలను సమన్వయం చేసి సమగ్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ రోజు శాసనసభలో తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగుపై కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, యశశ్వినీ రెడ్డి, తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. గతంలో తెలంగాణలో సుమారు 3 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు జరిగితే, ప్రస్తుతం అది సుమారు లక్ష ఎకరాలకు తగ్గిపోయిందని మంత్రి తెలిపారు. ఫలితంగా 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ వానాకాలంలో 51000 సాధారణ విస్తీర్ణానికి గాను 72,583 ఎకరాలలో కూరగాయల సాగు జరిగిందని తెలిపారు. కూరగాయల ధరలు ప్రధానంగా డిమాండ్, సరఫరాపై ఆధారపడి ఉండటం వల్ల మార్కెట్లో ధరల్లో తరచూ హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులకు లాభదాయకమైన పంటల వైపు వెళ్లేలా ప్రోత్సహించడంతో పాటు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నారు, మల్చింగ్, షేడ్‌నెట్, శాశ్వత పందిళ్లు, బిందు మరియు తుంపర సేద్యం వంటి సదుపాయాలను రైతులకు రాయితీలపై అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూరగాయల నారు, మల్చింగ్, షేడ్‌నెట్ కోసం రూ.20 కోట్లు, శాశ్వత పందిళ్ల కోసం రూ.8 కోట్లు, బిందు సేద్యం కోసం రూ.97 కోట్లుకేటాయించినట్లు వెల్లడించారు. అన్ని పంటలకు విస్తీర్ణం ఆధారంగానే రైతు భరోసా అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తక్షణమే పెంచేందుకు ప్రస్తుత వానాకాలంలో సుమారు లక్ష ఎకరాల్లో, తదుపరి రబీ సీజన్‌లో మరో లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణకు అవసరమైన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండా చేసి, తెలంగాణలో పండించిన కూరగాయలు ఇతర రాష్ట్రాలకు వెళ్లే స్థాయికి ఉత్పత్తిని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. రైతులు అధిక దిగుబడి, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు వెళ్లేలా వ్యవసాయ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కొన్ని పంటలు, కొన్ని పద్ధతులకే రాయితీలు పరిమితం కావడం వల్ల వ్యవసాయంలో సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. రైతులకు అవసరమైన పంటలు, భూమి సంరక్షణ, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే విధంగా రాయితీల విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి సేద్యాన్ని కూడా పెంచి పోషించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకొని రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. యూరియా వినియోగం పెరగడం వల్ల పురుగు మందుల వినియోగం కూడా పెరుగుతోందని మంత్రి తెలిపారు. యూరియా వినియోగాన్ని సమతుల్యం చేసేలా, భూమిని సంరక్షించే ఎరువులకు ప్రాధాన్యతనిచ్చే విధంగా సబ్సిడీ విధానాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. ఈ అంశంపై ప్రధానమంత్రి, కేంద్ర వ్యవసాయ మంత్రితో పలుమార్లు చర్చించినట్లు వెల్లడించారు. దక్షిణ భారత రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో ఈ నెల 18న సమావేశం నిర్వహించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. తెలంగాణలో గతంలో పరిమితంగా ఉన్న ఆయిల్‌పామ్ సాగును ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించినట్లు మంత్రి తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో అల్లం, కంది, కూరగాయలు వంటి వివిధ అంతర పంటలను సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు.ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటల ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా వ్యవసాయ విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెంచడంతో పాటు వాటి నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం అందించిన పథకాలను రాష్ట్రం తగిన స్థాయిలో వినియోగించుకోలేకపోయిందని పేర్కొంటూ, గత రెండు మూడు సంవత్సరాలుగా కేంద్రం నుంచి వచ్చే నిధులకు రాష్ట్ర వాటాను జోడించి 60:40 నిష్పత్తిలో వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాయితీలు అందిస్తున్నామని చెప్పారు. కోహెడ మార్కెట్‌కు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 170 ఎకరాల్లో భారీ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వివిధ రకాల పంటలను నిల్వ చేసుకోవడం, మార్కెటింగ్ చేయడం, ఎగుమతులు చేపట్టడం వంటి సదుపాయాలతో ఈ మార్కెట్‌ను రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రైవేటీకరణకే మొగ్గు?

ఇస్రో అంటే నేటి ప్రపంచంలో తెలియని వారుండరు. ఇస్రో అంతరిక్షయానంలో కీలక అడుగులు వేస్తూ భారతదేశ అమ్ములపొదిలో తనదైన స్థానంతో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పటికే ఎన్నో పరిశోధనలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. అలంటి ఇస్రో నేడు ప్రైవేటుపరం కాబోతోందని పుకార్లు చికారై చెక్కర్లు కొడుతోంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడుతుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయిజరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. ఏదేమైనా ఇస్రోను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకవేళ ప్రైవేటు దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తే అలాంటి ఆలోచనలు విరమించుకోవాలి. ప్రైవేటు దిశగా ప్రయత్నాలు చేస్తే దేశ అడ్డుకొని ప్రైవేటు పరంగా కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ్ ప్రజలపై ఎంతైనా ఉంది.

## రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర ) : రీ -సర్వే ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీ-సర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రీ-సర్వేకు సంబంధించిన కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ, వివరాల నమోదు తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి సంబంధించి రికార్డుల హక్కుల నవీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆర్.ఓ.ఆర్. లో వివరాల నవీకరణ చేపట్టేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక విధానాల ప్రకారం అన్ని చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో భాగంగా భూ రికార్డుల పరిశీలన, పాత రికార్డులతో నూతన రికార్డుల అనుసంధానం, కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ తదితర అంశాలలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర ) : సామాజిక అన్యాయాలు, దోపిడీ, అణచివేతను ఎదురించి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 2014కు ముందు ప్రభుత్వానికి కావాల్సిన బియ్యాన్ని మిల్లుల్లోనే ప్రభుత్వం కొనుగోలు చేసేది - ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ రెడ్డి




కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 10(విజన్ఆంధ్ర) : 2014కు ముందు ప్రభుత్వానికి కావాల్సిన బియ్యాన్ని మిల్లుల్లోనే ప్రభుత్వం కొనుగోలు చేసేదిని ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ రెడ్డి అన్నారు. రైస్ మిల్లులపై ఫిజికల్ వేరిఫికేషన్ పేరుతో జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సీఎంఆర్ బియ్యం అప్పగించేందుకు డిసెంబర్ 31 వరకు గడువు ఇవ్వాలని కోరారు. కామారెడ్డి కలెక్టరేట్ వద్ద కామారెడ్డి జిల్లారైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. 1960 నుంచి రైస్ మిల్లులు ఉన్నాయ్ .. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1960 నుంచి రైస్ మిల్లు పరిశ్రమ ఉందని, 2014కు ముందు ప్రభుత్వానికి కావాల్సిన బియ్యాన్ని మిల్లుల్లోనే కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. పుణ్యానికి ధాన్యం ఇస్తే పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారని కొందరు మాట్లాడటం సరికాదన్నారు. ధాన్యం పేరుతో ఇష్టారాజ్యంగా దాడులు చేస్తూ వేరిఫికేషన్ పేరుతో మిల్లర్లను జైలులో పెడితే సహించేది లేదని హెచ్చరించారు. 2020 నుంచి కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం మిల్లులలో 74 హెచ్ పీ ఉన్న బిల్లులను 350 నుంచి 400 హెచ్ పీ వరకు బిల్లులు పెరిగేలా మిషన్లు, కంప్రెషర్లు వేయించి ఆర్థిక భారం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నులు, కామారెడ్డి జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సీఎంఆర్ చెల్లించాల్సి ఉందని, ఫిజికల్ వేరిఫికేషన్ చేయకుండా ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. 2014 నుంచి 2024 వరకు 9.70 కోట్ల ధాన్యం మిల్లర్లకు అప్పగిస్తే 9.60 కోట్ల బియ్యం అప్పగించామని, కేవలం 2 శాతం బకాయి కోసం 98 శాతం మందిని వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. క్వింటాలుకు 67 కిలోల బియ్యం రాదని చెప్పినా వినడం లేదని, 67 కిలోల అంశంపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని, 67 కిలోలు వస్తుందని నిరూపిస్తే రైస్ మిల్లర్లందరం తప్పయిందని ఒప్పుకుంటామని సవాల్ చేశారు. పరిశ్రమలు మూతపడే పరిస్థితి..గతంలో జిల్లాలో 36 కాన్సార్ ఫ్యాక్టరీలు ఉండేవని, ఆ ఫ్యాక్టరీలు ఆర్థికంగా దెబ్బతిని మూతపడ్డాక రైతులు చెరకు పండించడం తగ్గించారని, ఫలితంగా చెరకు విస్తీర్ణం తగ్గి చక్కెర ధరలు అమాంతం పెరిగాయని గుర్తు చేశారు. అదే తరహాలో మిల్లర్లను ఇబ్బందులు పెడితే ఈ పరిశ్రమలు కూడా మూతపడితే రైతు వరికి బదులు కూరగాయలు పండించి బతకాల్సి వస్తుందని, అప్పుడు బియ్యం ధరలు అమాంతం పెరుగుతాయని హెచ్చరించారు. ఒక్క ఎల్ నినో వస్తేనే తట్టుకోలేకపోయారని, దేశంలో మూడు నాలుగేళ్లు పంటలు పండక కరువు వస్తే ప్రపంచంలో ఏ దేశానికైనా అన్నం పెట్టే స్థితిలో ఉన్న భారతదేశానికి ఏ దేశం అన్నం పెడుతుందని ప్రశ్నించారు. రూ.40-50 కోట్లు ముంచిన సంఘ విద్రోహక శక్తులను సంఘం నుంచి ఏరివేసి వారి నుంచి రికవరీ చేయాలని, దానికి తాము మద్దతిస్తామన్నారు.అసెంబ్లీ సెషన్స్ ముగిశాక తమతో చర్చలు జరపాలని, డిసెంబర్ 31 వరకు గడువు ఇవ్వాలని, ప్రభుత్వానికి బియ్యం అప్పగించిన తర్వాత వచ్చే పంట తమకు ఇవ్వాలన్నారు. ధర్నాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి సంతోష్, కోశాధికారి ముత్యపు సుదర్శన్, మాజీ అధ్యక్ష లు కంచర్ల లింగం, గౌరీ శంకర్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, రైస్ మిల్లర్లు, లారీ డ్రైవర్లు, మిల్లు ఆపరేటర్లు, గుమస్తాలు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీలో 46 టీఎంసీ ల నీళ్లున్నా జిల్లా రైతుల పంటలు ఎండిపోతున్నాయి

- **సుమారు 2 లక్షల ఎకరాల పంటలను కాపాడేందుకు 6 టీఎంసీల నీటిని వెంటనే విడుదల చేయాలి**
- **జిల్లాలో ఉన్న ఎత్తిపోతల పథకాలు గుత్ప, అలీసాగర్ లిఫ్ట్,**
- **లక్ష్మి లిఫ్ట్, చౌట్పల్లి హన్మంత్ రెడ్డి లిఫ్ట్**
- **బోదేపల్లి, వేంపల్లి, నవాబ్ లిఫ్ట్ లను ప్రారంభించి అన్ని మోటార్లు పూర్తి సామర్థ్యంతో నడిపి చెరువులు అన్ని నింపాలి**
- **SRSP పునరుజ్జీవ పథకం ద్వారా వరదకాలువ నింపి లో లెవల్ తూమ్ ల ద్వారా చెరువులు నింపాలి.**
- **ప్యాకేజి 21 ద్వారా కప్పల వాగు, పెద్దవాగులో చెక్ డ్యామ్ లు నింపాలి**
- **వ్యవసాయానికి 7 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నారు.. 24 గంటల కరెంట్ ఇవ్వాలి.**
- **రైతు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం దారుణం**
- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**




నిజామాబాద్ సెప్టెంబర్10 :( విజన్ ఆంధ్ర) : తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్రంలోని రైతాంగ సమస్యలు, నిజామాబాద్ జిల్లాలో ఎండిపోతున్న పంటలు, సాగునీటి విడుదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో నిజామాబాద్ జిల్లాలో చెరువులు, బోర్లు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రయత్నించగా, అసెంబ్లీ ప్రారంభమైన కొద్దిసేపటికే వారిని సస్పెండ్ చేసి ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. ప్రతిపక్ష గొంతును నొక్కడం ద్వారా రైతుల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించడం కావట్లేదు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ... ఎల్ నీనో ఉన్న భగవంతుడి దయతో స్థానికంగా కురిసిన వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (ఎస్సారెస్పీ)లో ప్రస్తుతం సుమారు 46 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల పంటలను కాపాడేందుకు కేవలం 6 టీఎంసీల నీటిని సమర్థవంతంగా వినియోగిస్తే సరిపోతుందని అన్నారు.

నీరు అందుబాటులో ఉండి, పంపులుమోటార్లు సిద్ధంగా ఉన్నప్పటికీ వాటిని పూర్తి సామర్థ్యంతో నడపకుండా ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఎమ్మెల్యే విమర్శించారు. గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్‌కు మొత్తం 540 క్యూసెక్కుల డిశ్చార్జ్ సామర్థ్యం ఉందని, నాలుగు మోటార్ల ద్వారా ఈ నీటిని విడుదల చేయవచ్చని తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం కేవలం ఒక మోటారు మాత్రమే నడుపుతూ 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తోందని అన్నారు.నాలుగు మోటార్లను పూర్తి సామర్థ్యంతో నడిపితే నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని వందలాది చెరువులను నింపి రైతుల పంటలను కాపాడవచ్చని తెలిపారు అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 720 క్యూసెక్కుల సామర్థ్యం ఉందని, నాలుగు మోటార్లను పూర్తి స్థాయిలో నడపాల్సి ఉండగా ప్రస్తుతం సగం మోటార్లను మాత్రమే ఆన్ఆఫ్ పద్ధతిలో నడుపుతున్నారని విమర్శించారు. నాలుగు మోటార్లను నిరంతరాయంగా నడిపితే బోధన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ ప్రాంతాల్లోని చెరువులకు నీరు అందించి పంటలను కాపాడవచ్చని తెలిపారు.గుత్ప, అలీసాగర్ లిఫ్ట్‌లను కలిపి రోజుకు 1,260 క్యూసెక్కుల చొప్పున నెలరోజులు నడిపినా సుమారు 3 నుంచి 3.5 టీఎంసీల నీరు మాత్రమే వినియోగమవుతుందని వివరించారు. బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీ కెనాల్‌కు 330 క్యూసెక్కుల సామర్థ్యం ఉందని, దీని ద్వారా సుమారు 28,000 నుంచి 30,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడంతో పాటు చెరువులను నింపే అవకాశం ఉందని తెలిపారు.

చౌట్‌పల్లి హన్మంత్రెడ్డి లిఫ్ట్ ద్వారా 160 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి 6070 చెరువులను నింపవచ్చని తెలిపారు. లక్ష్మీ కెనాల్, చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి, నవాబ్ లిఫ్ట్, బోధెపల్లి లిఫ్ట్, వేంపల్లి లిఫ్ట్,లను నెలరోజుల పాటు నడిపినా సుమారు 2 టీఎంసీ నీరు మాత్రమే అవసరమవుతుంది వెంటనే అన్ని లిఫ్ట్ లను ప్రారంభించి పూర్తి స్థాయిలో నడిపి బాల్కొండ నియోజకవర్గం లో అన్ని చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గారి సహకారంతో హరీష్ రావు మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన సారంగాపూర్, మెంట్రాజ్‌పల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించి కప్పలవాగుపెద్దవాగు ఔట్‌లెట్ల ద్వారా ఎస్సారెస్పీ నుండి కేవలం 0.5 టీఎంసీ నీటితో కప్పలవాగు, పెద్దవాగు ల్లో. పోసి చెక్‌డ్యామ్‌లను నింపి సుమారు 48,000 ఎకరాల పంటలను కాపాడే అవకాశం ఉందని తెలిపారు. గాయత్రి పంప్‌హౌస్ ద్వారా వరద కాలువలోకి రివర్స్ పంపింగ్ చేసి, లో-లెవల్ తూముల ద్వారా బాల్కొండ, కోరుట్ల నియోజకవర్గాల్లో సుమారు 40 చెరువులను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఎస్సారెస్పీ నుండి నావీణ ఎగువ ప్రాంతాలైన బాల్కొండ,కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల ఆయకట్టుకు కాకతీయ కెనాల్ ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు సురక్షితంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ సంస్థ జబ్రూ౼ా స్పష్టం చేసిన నేపథ్యంలో కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను నడిపి, ఎల్లంపల్లి, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా రివర్స్ పంపింగ్ చేసి ఎస్సారెస్పీని మరింతగా నింపుకునే అవకాశాలను ప్రభుత్వం వినియోగించుకోవాలని డిమాండ్ చేసారు. సార్సప్ ప్రాజెక్టులో నీరు ఉంది, పంపులుమోటార్లు సిద్ధంగా ఉన్నాయి, అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయి. అయినప్పటికీ మోటార్లు స్విచ్ ఆన్ చేసి రైతుల పంటలను కాపాడాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం బాధాకరమని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాజకీయ కక్షలు, పార్టీ విభేదాలను పక్కనపెట్టి యుద్ధప్రాతిపదికన నిజామాబాద్ జిల్లాలో ఉన్నటువంటి అన్ని ఎత్తిపోతల పథకాలను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ఎస్సారెస్పీ నీటిని అవసరమైన మేరకు విడుదల చేసి నిజామాబాద్ జిల్లాలో అన్ని చెరువులు నింపి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో నీళ్లు ఉండి రైతుల పంటలు ఎండిపోవడం ప్రభుత్వ వైఫల్యం. అందుబాటులో ఉన్న నీటిని తక్షణమే వినియోగించి రైతుల పంటలను కాపాడాలి" అని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడ.. రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి.**

మీడియా సమావేశం జరుగుతున్న సమయంలోనే వేల్పూర్ మండలం, బాల్కొండ నియోజకవర్గంలోని పడగల్ సబ్‌స్టేషన్ పరిధికి చెందిన హన్మంత్ రెడ్డి అనే రైతు పంపిన లైవ్ మెసేజ్‌ను ఆయన మీడియాకు చదివి వినిపించారు.రైతు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 7 గంటలకు విద్యుత్ సరఫరా ప్రారంభమై 11:30 గంటలకు నిలిచిపోయిందని, తిరిగి 12:45 వరకు సరఫరా లేదని, సాయంత్రం 4:45 గంటలకే మళ్లీ సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు రోజుకు 78 గంటల విద్యుత్ మాత్రమే అందుతోందని ఈ ప్రత్యక్ష సందేశం ద్వారా స్పష్టమవుతోందని అన్నారు. కాబట్టి గతంలో కేసీఆర్ ఇచ్చినట్టు 24 గంటల నాణ్యమైన కరెంట్ వ్యవసాయానికి ఇవ్వాలని డిమాండ్ చేసారు

## బోధన్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్

- **రాబోయే పండగల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు**
- **డ్రగ్స్ మరియు సైబర్ నేరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు**
- **రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలి**
- **పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి**
- **చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై నిర్విరమంగా దాడులు నిర్వహణ , అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు**
- **డయల్ 112 గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలి**




నిజామాబాద్ సెప్టెంబర్10:( విజన్ ఆంధ్ర ) : నేడు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బోధన్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి పై నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. సమగ్ర సమీక్ష సమావేశం బోధన్ సర్కిల్ కార్యాలయం యందు నిర్వహించగా బోధన్ డివిజన్ ఏ.సీ.పీ , సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు , ఎస్.హెచ్. ఓ లు , ఎస్సైలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి సార్ ఆదేశాల మేరకు డ్రగ్స్ మరియు గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని , అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని , ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు , రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బోధన్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం , చోరీలు , మహిళలపై నేరాలు , సైబర్ మోసాలు , డ్రగ్స్ మరియు గంజాయి అక్రమ రవాణా , పేకాట , గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని , రౌడీషీటర్లు , పాత నేరస్తులు , బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి , అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని , షీ టీమ్స్ , ఈగల్ టీమ్స్ , చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు , బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. అలాగే పేకాట , గుట్కా , ఇసుక మరియు ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని , ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ , రికార్డుల నిర్వహణ , స్టేషన్ పరిశుభ్రత మరియు సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి , నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. చివరిగా శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని , ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని , రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి , సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం , రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే మరియు స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని , ఓవర్ స్పీడ్ , త్రిబుల్ డ్రైవింగ్ , మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలి. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని , వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని , వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు. ఈ కార్యక్రమం బోధన్ ఏ.సి.పి శ్రీ పి. శ్రీనివాస్ , సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురునాయుడు , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ శ్రీ ఆర్. అంజయ్య , సీ.ఐ లు మరియు ఎస్.హెచ్.ఓ లు మరియు ఎస్.ఐ లు , ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## మట్టి గణపతులను పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం

**- జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.**




నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర); మట్టి గణపతులు పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్ లో గురువారం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మంచి మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, కృత్రిమ రంగుల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని అన్నారు. పండుగలన్ని సాంప్రదాయ పద్ధతుల్లో పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లింగాపూర్‌లో ఘనంగా పొలాల అమావాస్య పండుగ



లింగాపూర్ సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ) : లింగాపూర్ మండల కేంద్రంలో పొలాల అమావాస్య పండుగను గ్రామస్తులు ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన పొలాల పండుగా మాన్కరి రాథోడ్ కవిందర్ ఆధ్వర్యంలో జరిగిందిఈ సందర్భంగా గ్రామ నాయక్,రాథోడ్ కిరణ్ కారోబారి, రాథోడ్ శివలాల్ సర్పంచ్, జాదవ్ రాజశేఖర్,భజన మండలి సభ్యులు, కవి గాయకులు,గంగు పటేల్ , గ్రామ పెద్దలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం గ్రామస్తులంతా కలిసి తమ ఎడ్లను రంగురంగులుగా, ఆకర్షణీయంగా అలంకరించి హనుమాన్ మందిరం చుట్టూ భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం గ్రామ పటేల్ మెస్రం గంగు చేతుల మీదుగా సంప్రదాయబద్ధంగా తోరణం తెంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత ఎడ్లను తమ ఇళ్లకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

***1960 నుంచి కొనసాగుతున్న సోదరభావ సంప్రదాయం***

మా గ్రామంలో 1960 సంవత్సరం నుంచి పొలాల అమావాస్య పండుగను దళిత, బహుజన, ఆదివాసీ, లంబాడా సమాజాల ప్రజలు స్నేహపూర్వక వాతావరణంలో ఎంతో ఆప్యాయతతో, ఐకమత్యంతో కలిసి జరుపుకుంటున్నారని గ్రామ పెద్దలు తెలిపారు ఈ పండుగ కేవలం వ్యవసాయ సంప్రదాయానికి ప్రతీక మాత్రమే కాకుండా, గ్రామంలోని వివిధ సామాజిక వర్గాల మధ్య సోదరభావం, ఐక్యత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రామ పెద్దలు తెలిపారు.

## క్రీడాకారుల శ్రద్ధపై మరింత బాధ్యత పెరిగింది

**- ప్రభుత్వ పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చిన పిడి నరసింహులు**

**- పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి**



నారాయణపేట, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అవార్డులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో నర్సింలు పీడీకి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి చాలా గర్వంగా ఉందని అన్నారు . గురువారం నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పిడి నరసింహులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు పొందినందుకు పాఠశాలకు గ్రామానికి మంచి పేరు వచ్చిందని పిడి నరసింహులను అభినందించారు. అనంతరం పిడి నరసింహులు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం వల్ల మరింత బాధ్యతగా పెరిగి విద్యార్థులను జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో విద్యార్థులను తీసుకొని వెళ్లడానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, పాఠశాల క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషికి గాను జిల్లా విద్యాశాఖ నారాయణపేట ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు . ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు .ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విజయ, భాను ప్రకాష్ ,మధుసూదన్, నర్సింలు ,ప్రతాప్ ,నరసింహ, లక్ష్మణ్, రఘురాం రెడ్డి ,విజయ మంగళ శశిరేఖ, శ్రీదేవి, నిర్మల, శిరీష, సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళ్ళ పుండ్లు మనడానికి ఎండోవాస్కులర్ విధానంతో చికిత్స

**- యశోద ఆసుపత్రి ఎండోవాస్క్యులర్ వైద్యులు వినయ్ కుమార్**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర ) : చాలామందికి కళ్ళకు పుండ్లు అయి చికిత్స పొందిన మానడం లేదని, ఎందుకు ఆవిధంగా అవుతున్నాయని కారణం తెలుసుకుని చికిత్స అందిస్తే సరైన ఫలితం లభిస్తుందని కాళ్ళ పుండ్లు మనడానికి ఎండోవాస్క్యులర్ విధానంతో చికిత్స అందించి నయం చేయవచ్చని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు వినయ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని నార్తిన్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కళ్ళకు పుండ్లు అయి అవి మనకపోవడంతో కాళ్ళను తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అసలు ఎందుకు అలా మానడం లేదో పరీక్షల ద్వార తెలుసుకోవాలని, ఇలాంటి వాటిపై ఎన్నో రకాల కారణాలున్నాయన్నారు. ముఖ్యంగా చాలామందికి డైయాబేటీస్ ఉందని, ప్రతి 10 మందిలో సుమారు 5 గురికి షుగర్ ఉంటుందన్నారు. షుగర్ ఉన్నవాళ్ళలో ఇది ఎక్కువ ప్రభావం చూపెడుతుందని తెలిపారు. చెడు రక్త నాలాల ద్వారన లేదా మంచి రక్త నాలాల ద్వార వచ్చిన రక్తం వల్లన పరీక్షలు చేసి తెలుసుకోవాలన్నారు.మాములు పుండుకు వేరే లక్షణాలు ఉంటాయని అన్నారు. షుగర్ ను కంట్రోల్ లో ఉంచుకుంటే ఇలాంటివి రాకుండా జాగ్రత పడవచ్చన్నారు. ఇవి సాధారణంగా షుగర్ ఉండి ఎక్కువ కూర్చుని లేదా ఎక్కువ నిలబడిన వాళ్లలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.వెరికోస్ విన్స్, ఫెరిఫెరల్ ఆర్టరీ డిసిజ్ లాంటి వాటివల్ల, షుగర్ ఉన్నవాళ్లలో కాళ్లకు రక్త సరఫరా లేకపోవడం మూలంగా పుండ్లు ఏర్పడుతాయన్నారు.అవి ఇన్ఫెక్షన్ కు దారితీసే ప్రమాదం ఉందన్నారు.షుగర్ ఉన్న వాళ్ళు కాళ్ళ విషయాలో ప్రత్యేక జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు.రక్తానలాల వ్యాధుల లక్షణాలను మొదటి దశలోనే గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదిస్తే వ్యాధిని చికిత్స ద్వారా నివారించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పీఆర్వో అంకం మల్లేష్ పాల్గొన్నారు.

# కబ్జాలపై హైడ్రా కొరడా...!

**- మేడిపల్లి చెరువు, ప్రభుత్వ భూములపై అధికారుల ఉక్కుపాదం....**

**- బీజేపీ ఫిర్యాదుతో రంగంలోకి ఉన్నతాధికారులు**

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**- జోనల్ కమిషనర్ రాధికాగుప్తాతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ**



బోడుప్పల్,సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రభుత్వ భూములు, చెరువుల బఫర్‌జోన్‌లను కొల్లగొట్టే ఆక్రమణదారులకు ఇక చెక్ పడనుందా? మేడిపల్లి ప్రాంతంలో ప్రభుత్వ భూములు, చెరువు బఫర్‌జోన్‌లో అక్రమ ఆక్రమణలు, మట్టి పూడ్చివేతలు, నిర్మాణాలపై అందిన ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేరుగా రంగంలోకి దిగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్తాతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి విచారణ చేపట్టారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ10 డివిజన్, మేడిపల్లి ప్రాంతంలోని సర్వే నంబర్ 28లో సుమారు 15 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ భూమిపై వివాదం నెలకొంది. చెరువును ఆనుకుని ఉన్న బఫర్‌జోన్ భూముల్లో ఆక్రమణలు, నిర్మాణాలు జరుగుతున్నాయంటూ బీజేపీ నాయకులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్ రాధికాగుప్తా విచారణలో అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? ఆక్రమణలు జరిగితే బాధ్యులపై కొరడా ఝుళిపిస్తారా? అన్నది ఇప్పుడు మేడిపల్లి ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూమి ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కాకుండా కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు జమ్ముల ప్రభాకర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు బండారు పవన్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఏడు ఎకరాలు ఎక్కడికి వెళ్లాయి?**

బీజేపీ నాయకుల ఆరోపణల ప్రకారం.. సర్వే నంబర్ 28 పరిధిలో గతంలో సుమారు ఏడు ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. చెరువు ప్రాంతంలో మట్టి పోసి భూమిని చదును చేసి కమర్షియల్ పార్కింగ్ ఏర్పాటు చేశారని వారు పేర్కొన్నారు. ఇంతటి విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు ఉన్నా గతంలో సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. రెవెన్యూ రికార్డులు ఏమంటున్నాయి? భూమి వాస్తవ స్థితి ఏమిటి? చెరువు బఫర్‌జోన్ సరిహద్దులు ఎక్కడున్నాయి? అనే అంశాలపై హైడ్రా విచారణ కీలకంగా మారింది.

**సర్వే నంబర్ 29పైనా కన్ను**

సర్వే నంబర్ 29లోనూ నిర్మాణాల పేరుతో పనులు ప్రారంభించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని బీజేపీ నాయకులు అధికారులకు తెలిపారు. ప్రభుత్వ భూములు, చెరువు బఫర్‌జోన్‌లను రక్షించాల్సిన యంత్రాంగం గతంలో నిర్లక్ష్యం చేయడం వల్లే ఆక్రమణలకు అవకాశం ఏర్పడిందని ఆరోపించారు.

**రంగనాథ్‌రాధికాగుప్తా పరిశీలనతో కదలిక**

ఫిర్యాదును కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలనకు రావడం, ఆయనతో పాటు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్తా విచారణ చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణలో హైడ్రా వ్యవస్థ ఎంతవరకు కఠినంగా వ్యవహరిస్తుందో ఈ విచారణతో తేలనుంది. ఆక్రమణలు నిజమని నిర్ధారణ అయితే నిర్మాణాలు, మట్టి పూడ్చివేతలు, భూ వినియోగ మార్పులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

**కాంగ్రెస్‌బీఆర్ఎస్ హయాంలోనే బీజం పడిందా.?**

ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలకు గత బీఆర్ఎస్ హయాంలోనే బీజం పడిందని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ పరిరక్షణలో నిర్లక్ష్యం కొనసాగిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వాలు మారుతున్నా ఆక్రమణలపై చర్యలు ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. "ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికార యంత్రాంగం మౌనం వహిస్తే ఆక్రమణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. ప్రజా ఆస్తులు కబ్జా అవుతున్నా చూస్తూ ఊరుకునే పరిస్థితి ఉండకూడదు" అని బీజేపీ నాయకులు మండిపడ్డారు.

**రికార్డులు బయటకు వస్తే అసలు బండారం?**

సర్వే నంబర్ 28, 29 పరిధిలోని భూములపై పాత రెవెన్యూ రికార్డులు, చెరువు సరిహద్దులు, బఫర్‌జోన్ వివరాలు, నిర్మాణ అనుమతులు, భూమి వినియోగ మార్పులు, మట్టి పూడ్చివేతలకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

# !!..విజన్ ఆంధ్ర ఎఫెక్ట్..!!

## మల్లంపేట క్లినిక్‌లపై వైద్యశాఖ కొరడా..!

**- ఐదు వైద్య కేంద్రాల్లో విస్తృత తనిఖీలు**

**- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మూడు కేంద్రాలు సీజ్**

**- సీజ్ చేసినా మళ్లీ తెరిస్తే కఠిన చర్యలు తప్పవన్న డీఎంహెచ్‌వో**




కుత్బుల్లాపూర్/ మల్లంపేట్, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర): మల్లంపేటలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నారన్న అంశంపై బుధవారం విజన్ ఆంధ్ర దినపత్రికలో మల్లంపేటలో అర్హత లేని వైద్యం అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే స్పందించారు. గురువారం మల్లంపేటలోని పలు క్లినిక్‌లు, వైద్య కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. మొత్తం ఐదు కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు.. నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ లేని మూడు కేంద్రాలపై సీజ్ చర్యలు చేపట్టారు. తనిఖీల్లో శ్రీ మణికంఠ పోలీ క్లినిక్‌వాసవి మెడికల్ అండ్ జనరల్ స్టోర్, శ్రీ తిరుమల ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్వేత మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌లను అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో వైద్య సేవలకు సంబంధించిన అనుమతులు, వైద్యుల అర్హతలు, సిబ్బంది వివరాలు, కేంద్రాల నిర్వహణ తీరు, మందుల విక్రయాలకు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**అధికారుల తక్షణ స్పందన**

ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంపై విజన్ ఆంధ్రలో వచ్చిన కథనాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. వార్త ప్రచురితమైన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో మల్లంపేటలోని వైద్య కేంద్రాల నిర్వహణపై శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**మూడు కేంద్రాలపై చర్యలు**

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మూడు కేంద్రాలపై సీజ్ చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఈఎంవో వసంతకుమారి, డాక్టర్ గీత, పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ పవన్, అసిస్టెంట్ పీవో తదితర అధికారులు పాల్గొన్నారు. ఆయా కేంద్రాల్లో అనుమతులు, వైద్య సేవల నిర్వహణ, వైద్య సిబ్బంది అర్హతలు, మందుల విక్రయాలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.

**సీజ్ చేసినా.. మళ్లీ తెరిస్తే చర్యలే..!**

శ్వేత మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌లో నిర్వహిస్తున్న క్లినిక్‌ను గతంలోనే అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. అయితే సీజ్ అనంతరం తిరిగి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న అంశంపై విజన్ ఆంధ్రలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు గురువారం మరోసారి తనిఖీ చేసి సీజ్ చర్యలు చేపట్టారు. సీజ్ చేసిన కేంద్రాలను నిబంధనలకు విరుద్ధంగా తిరిగి తెరిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

**డీఎంహెచ్‌వో కె. ఆనంద్ వివరణ**

ఈ వ్యవహారంపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె. ఆనంద్ మాట్లాడుతూ.. మల్లంపేటలోని వైద్య కేంద్రాల నిర్వహణపై తనిఖీలు చేపట్టామని తెలిపారు. అనుమతులకు విరుద్ధంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన కేంద్రాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గతంలో సీజ్ చేసిన కేంద్రాలను తిరిగి నిర్వహిస్తున్నట్లు సమాచారం వస్తే వాటిని కూడా పరిశీలిస్తామని, వాస్తవాలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిబంధనలను ఉల్లంఘించే వైద్య కేంద్రాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని డీఎంహెచ్‌వో కె. ఆనంద్ స్పష్టం చేశారు.

**ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యం**

మల్లంపేటలోని క్లినిక్‌లు, వైద్య కేంద్రాల నిర్వహణపై వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సరైన అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు నిర్వహిస్తున్న కేంద్రాలపై తనిఖీలు కొనసాగనున్నాయి. ప్రజలకు నాణ్యమైన, నిబంధనలకు అనుగుణమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విజన్ ఆంధ్రలో వచ్చిన కథనంపై వైద్య ఆరోగ్యశాఖ తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం, మూడు కేంద్రాలపై సీజ్ చర్యలు చేపట్టడం మల్లంపేటలో చర్చనీయాంశంగా మారింది.

## ఈసీఐఎల్‌లో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ. వర్ధంతి వేడుకలు..!



కాప్రా/సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : తెలంగాణ రజక సమితి అధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ 41వ.వర్ధంతి ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ప్రముఖులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ,బిజెపి రాష్ట్ర నాయకులు బేతి సుభాష్ రెడ్డి, సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని అన్నారు. మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆ యోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, బొంతు శ్రీదేవి, పావని మణిపాల్ రెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, కొత్త అంజిరెడ్డి కాసం మహిపాల్ రెడ్డి, నాగిళ్ల బాల్ రెడ్డి, యాదగిరి రావు,మోహన్ రెడ్డి, బేతాళ బాలరాజు, సుడుగు మహేందర్ రెడ్డి అల్లూరయ్య శ్రీకాంత్ ఏనుగు సీతారాం రెడ్డి రహీం జయరాం మణమ్మ యాకయ్య భాష మహేష్ శ్రీనివాస్ యావపురం రవి అశోక్ పద్మారెడ్డి గడ్డం శ్రీనివాస్ వెంకట్ శ్రీనివాస్ సత్యం రవి తెలంగాణ రజక సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శనిగరం అశోక్, రాష్ట్ర అధ్యక్షులు ముంజంపల్లి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజు, సోమయ్య రాష్ట్ర కార్యదర్శి సకినాల రవి, రాష్ట్ర కోశాధికారి జంజీరాల సత్యనారాయణ, రత్నాల కనకయ్య, కర్ణాకర్ కొమురయ్య, నరేష్ శ్రీకాంత్, యాకయ్య. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో ఆవు దూడ మృతి



లింగాపూర్ సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ విజేష్ ఆవు దూడను మేత నిమిత్తం వ్యవసాయ చేను హద్దు శివారంలో ఆవుదూడ కట్టేసి వ్యవసాయ పనులు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పాముకాటుతో వేయడంతో అక్కడికక్కడే ఆవు దూడ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది దీనిని గమనించిన రైతు కన్నీరు మునిరాయి దుఃఖ సముద్రంలో మునిగిపోయారు . దీని వేల 25 వెలు వరకు ఉంటుందని రైతు తెలిపారు. వ్యవసాయ అధికారులు చొరవచూపి నష్టపరిహారం వచ్చే విధంగా తోడ్పడాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి



కాటారం డివిజన్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా కాటారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర ) : చిట్యాల చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని బైపాస్ రోడ్ లోగల రజక సంఘం కమ్యూనిటీ భవనంలో చాకలి ఐలమ్మ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. రజక సంఘం పట్టణ అధ్యక్షులు పారిపెల్లి శ్రీనివాస్, సంఘం భాద్యులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లార్పించారు.అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ దేశముక్ లాంటి దొరలను ఏదిరించిన ధీర వనిత ఐలమ్మ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని కోరారు. ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించాలని, ఆమె ఆశయ సాధనకోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో సంఘం ప్రధాన కార్యదర్శి పోశం, ఉపాధ్యక్షులు ధర్మయ్య, కుమార్, నల్లూరి మల్లయ్య, ముఖ్య సలహాదారు నేరెళ్ల రమేష్, డైరెక్టర్ సమ్మయ్య, మధు పాల్గొన్నారు.

## హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర ) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో మార్కింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్.ఐ.ఆర్.2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగులో కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు లక్కీడ్రా.

**- అదనపు కలెక్టర్ మహేందర్ జి**



ములుగు సెప్టెంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయ తరగతుల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రాను పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జీ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయన ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలను ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అందుబాటులో ఉన్న సీట్లను లక్కీ డ్రా ద్వారా భర్తీ చేసి ఎంపికైన జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సిద్ధార్థ రెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రధానాచార్యుడు సీతారాం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ముందుండాలి - మణిగాల రాకేష్.



కమలాపురం సెప్టెంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని జ్వాలా స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి మరియు జన విజ్ఞాన వేదిక ఆరోగ్య విభాగ సమన్వయకర్త మణిగాల రాకేష్ పిలుపునిచ్చారు. జ్వాలా స్వచ్ఛంద సంస్థ, జన విజ్ఞాన వేదిక ములుగు జిల్లా విజ్ఞాన విభాగం, కమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో మట్టి గణపతి విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించారు. బాధ్యత ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సునీత సహకారంతో విద్యార్థులు వందకు పైగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మణిగాల రాకేష్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని చేసే విగ్రహాలకు దూరంగా ఉండి మట్టి గణపతులనే పూజించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం అత్యుత్తమంగా విగ్రహాలు తయారు చేసిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు, పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధ్యత ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సునీత, ఉపాధ్యాయులు నాగమ్మ, నాగలక్ష్మి, మౌలాలి, రాజేశ్వర్, నరేష్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యల నివారణపై అవగాహన ర్యాలీ

**- జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు.**




ములుగు సెప్టెంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ములుగులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ ఆత్మహత్య అనేది తీవ్రమైన ప్రజారోగ్య మానసిక సమస్య అని, బాధను దాచుకోకుండా మౌనం వీడి బహిరంగంగా మాట్లాడితే ఆత్మహత్యలను నివారించవచ్చని తెలిపారు. చిన్న ఓదార్పు, సకాలంలో సహాయం అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చని, సామాజిక కళంకాన్ని తగ్గించి బాధితుల పట్ల సానుభూతి చూపాలని, అదే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఇంచార్జి పర్యవేక్షకుడు డాక్టర్ బిక్షపతి రావు మాట్లాడుతూ తీవ్ర ఒత్తిడి, నిరాశలో ఉన్న వారిని కుటుంబ సభ్యులు, స్నేహితులు గుర్తించి మనోధైర్యం కల్పించి మానసిక వైద్యుల ద్వారా సలహాలు ఇప్పించాలని సూచించారు. అంటువ్యాధులు కాని వ్యాధుల నియంత్రణ జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ మానసిక ఇబ్బందులు ఉన్నవారు సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ ల14416 టెలి మానస్‌ల కు 24 గంటలు ఫోన్ చేసి సలహాలు పొందవచ్చని తెలిపారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ గౌతమ్, మాతా శిశు సంరక్షణ జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీకాంత్, ప్రచార అధికారి సంపత్, ఎన్ సి డి సమన్వయకర్త వెంకట్ రెడ్డి, ఆర్ బి ఎస్ కె వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌకూర్‌లో విద్యుత్ సమస్యలను పరిష్క రించాలి

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తుడిమెళ్ల మల్లికార్జున్**



మల్కాజిగిరి, సెప్టెంబర్ 10, (విజన్ ఆంధ్ర):కౌకూర్‌లో నెలకున్న విద్యుత్ సమస్యలను పరిష్క రించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తుడిమెళ్ల మల్లికార్జున్ కోరారు. గురువారం ఆయన కౌకూర్ గ్రామ పెద్దలతో కలిసి కౌకూర్ బస్ స్టాప్ జంక్షన్‌ను పరిశీలించి, జంక్షన్ అభివృద్ధిపై వారి సూచనలు, అభిప్రా యాలను స్వీకరించారు. అనంతరం కౌకూర్‌లో జంక్షన్ అభివృద్ధి, విద్యుత్ సమస్యలపై సంబంధించిన అధికారులతో చర్చించారు. అనంతరం టీఎస్ ఎస్ పీడీ సీ ఎల్ సైనిక్‌పురి డివిజన్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (డీఈఈ) అన్వర్ పాషా ని కలిసి కౌకూర్ బస్ స్టాప్ జంక్షన్ అభివృద్ధిలో భాగంగా పోల్స్ షిఫ్టింగ్‌పై చర్చించారు. అలాగే సమాల లక్ష్మీ నగర్‌లో కొత్త 11 కేవీ లైన్‌ను సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు జరుగు తున్న ఫీడర్ స్ట్రింగింగ్ పనుల వల్ల చిన్న వెడల్పు గల రోడ్లు ఉన్న సమాల లక్ష్మీ నగర్ చివరి వీధికి ఇబ్బందులు, నష్టం కలిగే అవకాశం ఉందని డీఈఈ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ప్రత్యామ్నాయంగా భరత్ నగర్ సబ్‌స్టేషన్ వైపు ఫీడర్‌ను తీసుకెళ్లే మార్గాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. ప్రజలకు, వాహన దారులకు సౌకర్యవంతంగా ఉండేలా జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో యాప్రాల్ డివిజన్‌లోని కౌకూర్‌లో ప్రజా అవసరాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు , గౌమారం అంజిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, శివరాజ్, సతి రెడ్డి, వేణు గౌడ్, సమాల మాధవ్ రెడ్డి , విజయ్ కుమార్, షేపర్తి శంకర్, ప్రభాకర్ రెడ్డి, మెట్టు బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగంతో పాటు కుటుంబ బాధ్యతలూ ముఖ్యం

**- జిల్లా ఎస్పీ సునితరెడ్డి**

**- మద్యపాన వ్యసనం వీడిన ఏఆర్ కానిస్టేబుళ్లకు ఆత్మీయ కౌన్సిలింగ్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 10 (విజన్ ఆంధ్ర) : ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తించాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి తెలిపారు. మద్యపాన వ్యసనానికి బానిసలై, ఉచిత వైద్య చికిత్స అనంతరం తిరిగొచ్చిన ఏఆర్ కానిస్టేబుళ్లు కిరణ్, నరసింహలకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె ఆత్మీయ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, కుటుంబ సంతోషం పోలీసు శాఖకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వ్యసనాల వల్ల కుటుంబాలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే వారిని హైదరాబాద్‌లోని డీ–అడిక్షన్ సెంటర్‌కు పంపి నెల రోజుల పాటు చికిత్స అందించినట్లు తెలిపారు. తప్పులను సరిదిద్దుకుని ముందడుగు వేయడమే నిజమైన విజయమని, చికిత్స ద్వారా వచ్చిన మార్పును జీవితాంతం కొనసాగించాలని సూచించారు. విధుల్లో క్రమశిక్షణతో పాటు కుటుంబానికి ప్రేమ, భరోసా అందించాలని పిలుపునిచ్చారు. సమస్యను అర్థం చేసుకుని చికిత్స అందించడమే కాకుండా వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ ఇచ్చినందుకు కానిస్టేబుళ్లు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై మద్యానికి దూరంగా ఉంటూ, బాధ్యతాయుతంగా జీవిస్తామని హామీ ఇచ్చారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

**- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వెల్లడి**

**- కందకుర్తి, యంచ పుష్కర ఘాట్ల వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**- పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు**



నిజామాబాద్, సెప్టెంబర్ 10 : (విజన్ ఆంధ్ర )గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది జూన్, జూలై మాసాలలో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పుణ్య స్నానాల కోసం జిల్లాలోని వివిధ పుష్కర క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ల వద్ద సదుపాయాల కల్పన కోసం అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. త్రివేణి సంగమ ప్రాంతం అయిన రెంజల్ మండలం కందకుర్తి వద్ద, నవీపేట మండలం యంచ వద్ద గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శంకుస్థాపనలు చేశారు. కందకుర్తి వద్ద నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 6.05 కోట్ల అంచనా వ్యయంతో పుష్కర ఘాట్ నిర్మాణానికి, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.3.90 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణాలకు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 5.00 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా యంచ వద్ద రూ. 2.15 కోట్ల నిధులతో పుష్కర ఘాట్, రూ. 70 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అట్టహాసంగా నిర్వహించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ఒక్క కందకుర్తి పుష్కర క్షేత్రం వద్దనే అన్ని శాఖల పనులను కలుపుకుని సుమారు 30 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నామని వివరించారు. భక్తుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా, సురక్షితమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా, పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్లాలని అన్నారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# నీటి వనరులు వృధా కాకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి

**అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి**



నిజామాబాద్, సెప్టెంబర్ 10 :( విజన్ ఆంధ్ర ) ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో, అందుబాటులో ఉన్న నీటి వనరులు వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష జరిపారు. వివిధ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడ కూడా చుక్క నీరు సైతం వృధా కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీటి అవసరాలకు నీటిని నిలువ ఉంచుతూ, పంటలను కాపాడేందుకు వీలుగా రెండు తడుల వరకు సాగు నీటిని విడుదల చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాలు చివరి ఆయకట్టు వరకు చేరేలా గట్టి నిఘా ఉంచాలని, నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ నీటి నిల్వలు వృధా కాకుండా చూడాలని సూచించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలలో ఎంతమాత్రం రాజీ పడబోమని, నీటి వృధా జరిగి పంటలు ఎండితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని తేల్చి చెప్పారు. నీటి వృధాను నిలువరించేందుకు అవసరమైన చోట కాలువలు, తూముల మరమ్మతులు వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, ఈ పనులకు కావాల్సిన నిధులను సమకూరుస్తామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. ఖరీఫ్ పంట సేకరణకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వీలుగా గోడౌన్ లలో నిలువ ఉన్న బియ్యం నిల్వలను నిర్దేశిత ప్రాంతాలకు వేగంగా తరలించాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకుంటున్న బాలబాలికలకు ఏకరూప దుస్తులను త్వరితగతిన అందించాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యతతో యూనిఫాంలు కుట్టి అందించేలా స్వయం సహాయక సంఘాలకు బాధ్యతను అప్పగించడం జరిగిందని, వారు సకాలంలో దుస్తులు కుట్టి ఇచ్చేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# పంచాయతీలకు నిధుల వినియోగంలో జాప్యానికి చెక్

**- పంచాయతీరాజ్ సవరణ బిల్లుతో గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం**

**- అసెంబ్లీలో సవరణ బిల్లుకు మద్దతుగా మాట్లాడిన ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**



నిజామాబాద్ సెప్టెంబర్10:( విజన్ ఆంధ్ర ) : గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను మరింత సులభంగా, వేగంగా వినియోగించుకునేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018 (నాలుగో సవరణ) బిల్లు-2026 కు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి శాసనసభలో మద్దతు తెలిపారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధుల కొరతతో పాటు నిధుల వినియోగంలో జాప్యాన్ని తొలగించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 70, సబ్ సెక్షన్ (3)కు సవరణ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన బిల్లుపై ఎమ్మెల్యే భూపతి రెడ్డి గురువారం సభలో మాట్లాడారు. ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వివిధ పథకాల కింద వచ్చే నిధులు ట్రెజరీ ద్వారా జమ కావడం, వాటిని అభివృద్ధి పనులు, సిబ్బంది జీతాలు, ఇతర అవసరాలకు వినియోగించుకునే క్రమంలో అనేక పరిపాలనా ప్రక్రియల కారణంగా జాప్యం జరుగుతుండేదని ఎమ్మెల్యే వివరించారు. కొన్ని సందర్భాల్లో నిధుల ఉపసంహరణకు నెలల సమయం పట్టడంతో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఆలస్యమయ్యేవని తెలిపారు.

*గ్రామాల అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం*

కొత్త సవరణతో గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, వివిధ పథకాల ద్వారా వచ్చే నిధులను స్థానిక సహకార బ్యాంకులు, జాతీయ బ్యాంకులు, పోస్టాఫీసుల్లో జమ చేసుకునే అవకాశం కలుగుతుందని భూపతి రెడ్డి తెలిపారు. దీనివల్ల గ్రామ పంచాయతీలు తమ అవసరాలకు అనుగుణంగా నిధులను సకాలంలో వినియోగించుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేసుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, పంచాయతీ భవనాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి నిధుల సకాలంలో లభ్యత ఎంతో కీలకమని ఆయన అన్నారు. నిధులు ఉన్నప్పటికీ వాటి వినియోగంలో జాప్యం జరగడం వల్ల గ్రామాల అభివృద్ధి ప్రభావితం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సవరణను తీసుకురావడం అభినందనీయమన్నారు.

*స్థానిక సంస్థల బలోపేతమే ప్రజాపాలన లక్ష్యం*

గ్రామ పంచాయతీలను మరింత స్వయం సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు స్థానిక సంస్థలకు పరిపాలనా సౌలభ్యాన్ని కల్పించడంలో ఈ సవరణ కీలక అడుగుగా నిలుస్తుందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆలస్యం కాకుండా, ప్రజలకు అవసరమైన పనులకు సకాలంలో అందుబాటులోకి రావాలి. నిధుల వినియోగంలో జాప్యాన్ని తగ్గించి, గ్రామ పంచాయతీలకు మరింత వెసులుబాటు కల్పించే ఈ సవరణను స్వాగతిస్తున్నాను" అని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణాభివృద్ధికి వేగం పెంచడం ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటని భూపతి రెడ్డి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణలో పారదర్శకతను కొనసాగిస్తూ, నిధులు సకాలంలో ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడే ఈ సవరణ బిల్లుకు శాసనసభలో తన సంపూర్ణ మద్దతు ఉంటుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి స్పష్టం చేశారు.

# పుష్కరాల పనులన్నీ శాఖల సమన్వయంతో చేపట్టాలి

**- గడువులోగా పనులు పూర్తి చేయాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర); బాసరలో పుష్కరాల పనులపై జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్. గోదావరి పుష్కరాల పనులన్నీ శాఖల మధ్య సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల తో కలిసి బాసర ఈవో కార్యాలయంలో గోదావరి పుష్కరాల పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాసరలో పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు, వీఐపీ, వీవీఐపీ భక్తులకు ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాల నిర్వహణ, భక్తుల రద్దీ నియంత్రణ, సంఖ్య లెక్కింపు అంశాల్లో ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలన్నారు. చేపట్టే పనులను సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలని స్పష్టం చేశారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. భక్తుల రద్దీ మేరకు తగినన్ని ఆర్టీసీ బస్సులు నడపాలని వివరించారు. పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తగినన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, త్రాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పుష్కరాలకు వచ్చే భక్తులకు తగిన భద్రత కల్పిస్తామని అన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయంతో ఉండి, భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ తరపున సహకారం అందిస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, కేంద్రీకృత విధానం ద్వారా నిఘా ఉంచుతామని అన్నారు. సీసీ కెమెరాల సహాయంతో భక్తుల భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. తగినంత మంది పోలీసు సిబ్బందిని పుష్కరాలకు కేటాయిస్తామని ఎస్పీ అన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యుఎస్, పంచాయితీరాజ్, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, సందీప్, శంకరయ్య, అనిల్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**- ఎస్పీ సునితారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఎస్పీ సునితారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 8వ ఎడిషన్ ఆర్‌జే ఇంటర్ స్కూల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్2026లో విజయం సాధించిన రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె అభినందించి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో ఓటమిని సైతం సానుకూలంగా తీసుకుని విజయం కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, కోచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారుల భరతం పడతాం

**- బీసీ పొలిటికల్ జేఏసీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 10 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో అవినీతి అధికారుల భరతం పట్టడమే తమ ప్రధాన లక్ష్యమని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు స్పష్టం చేశారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాతూ వనపర్తి బీసీ హాస్టల్ వార్డెన్ అవినీతి బాగోతాన్ని సాక్ష్యాధారాలతో అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, విచారణ జరిపిన ఉన్నతాధికారులు సదరు వార్డెన్‌తో పాటు సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజల పన్నులతో వేతనాలు పొందుతూ అవినీతికి పాల్పడే అధికారులను వెంటపడి మరీ పట్టుకుంటామని, నిజాయితీగా పనిచేసే అధికారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సస్పెన్షన్ బీసీ పొలిటికల్ జేఏసీ సాధించిన మరో విజయమని వ్యాఖ్యానించారు. ఫిర్యాదుపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్న జిల్లా ఉన్నతాధికారులకు జేఏసీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి.వి. గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, సెప్టెంబర్ 10 :(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం పర్య వేక్షకుడు బాలరాజ్, సిబ్బంది సాత్విక్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## కలెక్టరేట్ లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 10,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఐలమ్మ పోరాటాలను గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పాత్రను వివరించారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని లిఖించిందని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలనకు పాటుపడిన గొప్ప మహిళ అని వివరించారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చాకలి ఐలమ్మ లాంటి వీర వనితల చరిత్రను నేటి తరం ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుల ను పూజిద్దాండ. పర్యావరణం ను పరిరక్షిద్దాం

**- పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి. సెప్టెంబర్ 10: (విజన్ ఆంధ్ర) : హోప్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ అభినందనియం పిఏసి చైర్మన్ వినాయకచవితి పర్వదినం ను పురస్కరించుకుని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6,500 మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ కార్యక్రమం ను వివేకానంద నగర్ లో పిఏసి చైర్మన్ నివాసంలో ప్రారంభించి, పంపిణి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక భాధ్యత అని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మట్టి వినాయకులను పూజించాలని, చెరువులను కలుషితం కాకుండా చూడాలని, చెరువులను సంరక్షించుకోవాలని, మొక్కలు పెంచాలని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చాలా గొప్ప విషయం అని , మట్టి వినాయకుల పంపిణీ నీ చేయడం పట్ల హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ని చైర్మన్ గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 6,500 మట్టి వినాయకుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు బసిరెడ్డి మధుసూధన్ రెడ్డి, సింగదాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన పీఏసీ చైర్మన్



శేరిలింగంపల్లి. సెప్టెంబర్ 10:( విజన్ ఆంధ్ర) : కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ కాలనీ పార్క్ లో జరిగిన వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్ అధికారి జి. సృజన జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలెంపాటి డీసీ సేవా ఇస్లావత్ తాజా మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ మరియు సీ.ఎం .సి.పలు విభాగాల అధికారులు , కాలనీల రేసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సమీక్షా సమావేశం జరిపిన గౌరవ పిఏసి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ వార్డు పరిధిలోని కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సిఎం సీ అధికారులతో ముఖాముఖి సమావేశం లో కాలనీల వాసులు పలు సమస్యలను మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులను కమిషనర్ పీఏసీ చైర్మన్ దృష్టికి తీసుకురాగా కాలనీల సమస్యలను ప్రథమ ప్రాధాన్యత గా తీసుకొని త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడలని, పనులలో అలసత్వం ప్రదర్శించకుండా త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడలని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగం జలమండలి అధికారులు మరియు నాయకులు కార్యకర్తలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**- దొమ్మాటి కిరణ్ కుమార్ రావు**




కాప్రా/ సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తన ధైర్యసాహసాలతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని దొమ్మాటి కిరణ్ కుమార్ అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమెకు ఘన నివాళులు అర్పించిన ఆయన మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. నాటి భూస్వామ్య, వెట్టి చాకిరీ వ్యవస్థలకు ఎదురొడ్డి నిలబడటం సాధారణ విషయం కాదని, ఎన్ని బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా తన హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ తెలంగాణ మహిళల ధైర్యానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆమె పోరాటం ఒక్క కుటుంబం లేదా ఒక వర్గానికి సంబంధించినది కాదని, అణగారిన ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం సాగిన ఉద్యమానికి ప్రతీక అని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను కేవలం జయంతులు, వర్ధంతుల సందర్భంగా స్మరించుకోవడానికే పరిమితం చేయకుండా, పేదలు, బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. “అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం పోరాడే తెగువ, ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పమే చాకలి ఐలమ్మ మనకు అందించిన నిజమైన వారసత్వం. ఆమె ఆశయాలను భావితరాలకు అందించడమే మనం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి” అని దొమ్మాటి కిరణ్ కుమార్ రావు ఈ కార్యక్రమంలో ఉద్యమ కారుడు కీర్తి శ్రీనివాస్,సీనియర్ నర్రా శ్రీనివాస్ రెడ్డి తదితరులు పేర్కొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధన కోసం ముందుకు సాగుదాం

**- కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్**




కాప్రా /,సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్ పిలుపు నిచ్చారు. సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ. వర్ధంతిని పురస్కరించుకొని ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆమె విగ్రహానికి గురువారం ప్రెస్ క్లబ్ సలహాదారులు ఎంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, మాజీ అధ్యక్షుడు శనిగరం అశోక్, కోశాధికారి రామచంద్రమూర్తి, జర్నలిస్టులు పలుగుల పవన్, రమేష్, కీర్తి శ్రీనివాస్, దొమ్మాటి కిరణ్ కుమార్, గాదె రాములతో కలసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెరుగు చంద్రమోహన్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక అసమానతలు, దోపిడీ, వివక్షకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గానికి చెందిన పోరాట యోధురాలు మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయురాలని మెరుగు చంద్రమోహన్ అన్నారు. ఆమె త్యాగాలను భావితరాలకు తెలియజేస్తూ, ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

## ముఖ్యమంత్రి సహాయానిది పేదలకు వరం



కాప్రా/సెప్టెంబర్ 10, ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని 9 మంది అనారోగ్య బాధితులకు స్థానిక శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి ( సి.ఎం.ఆర్. ఎఫ్ ) చెక్కులను మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనారోగ్య బాధితులకు ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జయపాల్, శేఖర్ గౌడ్, నరేందర్తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

**- వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 10 (విజన్ ఆంధ్ర) : ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం వీరనారి చాకలి ఐలమ్మ చూపిన తెగువను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ భూస్వామ్య దోపిడీకి, సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడ్డారని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ అన్యాయాన్ని ఎదిరించి ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, తెలంగాణ చరిత్రలో ఆమె పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట పటిమ సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, అన్యాయాన్ని ప్రశ్నించిన ఆమె సేవలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్తలు రాజారాం ప్రకాష్, గంధం నాగరాజు చాకలి ఐలమ్మ జీవిత విశేషాలపై పాడిన పాటలు సభలోని వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల, వివిధ జిల్లాల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు పీహెచ్‌సీల్లోనే తక్షణ వైద్యం అందించాలి

**- గర్భిణుల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**- పదో తరగతిలో 100%ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు**
**- కడుకుంట్ల పీహెచ్‌సీ, జడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**




*ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత*

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 10 (విజన్ ఆంధ్ర) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) స్థాయిలోనే పాము కాటు బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం వనపర్తి మండలం కడుకుంట్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

*పాము కాటుకు ముందస్తు మందుల నిల్వలు*

పీహెచ్‌సీలలో యాంటీ స్నేక్ వెనం (ఏఎస్‌వీ) నిల్వలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పాము కాటు కేసులు వచ్చినప్పుడు ఎలాంటి జాప్యం లేకుండా ప్రాథమిక చికిత్స అందించాలని, అవసరమైన పక్షంలోనే ఉన్నత వైద్య సేవలకు తరలించేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

*గర్భిణుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ*

పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులను నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యంగా రక్తహీనతతో బాధపడుతున్న వారిని ముందస్తుగా గుర్తించి మెరుగైన వైద్యం, అవసరమైన పరీక్షలు అందించాలని ఆదేశించారు. వైద్యుల సూచనల మేరకు వారికి అవసరమైన మందులు పంపిణీ చేయడంతో పాటు పోషకాహారంపై తగిన అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని, వార్డులు, చికిత్సా గదులు, మరుగుదొడ్లను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది చొరవ చూపాలని కోరారు.

*పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన*

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా 100% ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేయాలని జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిజిక్స్, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్‌తో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆటల మైదానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ భాస్కర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

**- ఘనంగా వీరవనిత చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి**
**- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మండ్ల రాజు**



వనపర్తి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర) : భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అసలైన వారసులు ముమ్మాటికీ కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మండ్ల రాజు స్పష్టం చేశారు. గురువారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని హమాలీ సంఘం కార్యాలయంలో ఆర్. భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన వీరనారి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీపీఎం మాజీ ఎంపీటీసీ జీ. బాలయ్యతో కలసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మండ్ల రాజు మాట్లాడుతూ... దొరలు, దేశ్‌ముఖ్‌లు, పటేల్-పట్వారీల నియంతృత్వ పోకడలకు, కుల వివక్షకు వ్యతిరేకంగా ‘దున్నేవాడికే భూమి కావాలి‘ అనే నినాదంతో సాగిన పోరాటంలో ఐలమ్మ పాత్ర చిరస్మరణీయమన్నారు. కౌలుకు తీసుకున్న భూమిలో కష్టపడి పండించిన పంటను భూస్వామి విసునూరు రామచంద్రారెడ్డి దౌర్జన్యంగా కాజేయాలని చూస్తే, వీరోచితంగా ఎదిరించి తరిమికొట్టిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఆంధ్రమహాసభ పిలుపుతో, కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన పోరాటంలో 3,500 గ్రామ స్వరాజ్యాలు ఏర్పడి, 10 లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో 4,000 మంది కమ్యూనిస్టు యోధులు ప్రాణాలర్పించారని తెలిపారు. ప్రజల భూమి, హక్కుల కోసం జరిగిన ఈ మహత్తర పోరాటాన్ని మతోన్మాద శక్తులు తమ స్వార్థం కోసం హిందూ-ముస్లింల నడుమ జరిగిన కొట్లాటగా వక్రీకరిస్తున్నాయని, ఇలాంటి అసత్యాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఐలమ్మ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు పెద్ద మన్యం, రామస్వామి, సురేష్, వెంకటేష్, చెన్నయ్య, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధ శతాబ్దపు ఆధ్యాత్మిక వైభవానికి చిన్న జీయర్ స్వామి


**- మార్చి 10, 11, 12 తేదీల్లో వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి స్వర్ణోత్సవాలు**
**- ఆహ్వానించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, ధర్మకర్త రఘునాథాచార్యులు**
**- సానుకూలంగా స్పందించిన చిన్నజీయర్ స్వామి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : వనపర్తిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం జరిగి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహోత్సవాలకు త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామివారు హాజరుకానున్నారు. వచ్చే ఏడాది మార్చి 10, 11, 12 తేదీల్లో జరగనున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలకు విచ్చేయాలని ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యులు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలు స్వామివారిని కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారి ఆహ్వానాన్ని స్వీకరించిన చిన్న జీయర్ స్వామి సానుకూలంగా స్పందిస్తూ... మార్చి 10, 11, 12 తేదీల్లో వనపర్తికి విచ్చేస్తామని హామీ ఇచ్చారు. ఐదు దశాబ్దాల ఆలయ ఆధ్యాత్మిక ప్రస్థానానికి గుర్తుగా జరిగే ఈ స్వర్ణోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ శరవేగంగా ఏర్పాట్లు చేస్తోందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన సతీమణి శారదా రెడ్డి, కుమారుడు నవనీత్ రెడ్డిలతో కలిసి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఎస్ఎల్ఎన్ రమేష్, తిరుమల మహేష్, వికాస తరంగిణి ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యపై అయిజ లో ధర్నా

**- రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ వెంటనే ఇవ్వాలి**
**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ఎస్.రామచంద్రారెడ్డి**



అయిజ సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని 33/11 సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సమస్యపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ఎస్.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రైతులు, బీజేపీ నాయుకులు, కార్యకర్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ఉదయం 5 గంటల నుండి సాయత్రం 5 గంటల వరకు రావాలి, కాని పలు మార్లు విద్యుత్ కట్ చేస్తూ, సక్రమంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు పొలాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన సమయంలో విద్యుత్ అందకపోతే పంటలు ఎండి పోతున్నవి అని ధర్నా చేశామని తెలిపారు. అనతరం ఇంచార్జ్ ఏడి. మక్బూల్ 2 రోజులలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాము అని స్పష్టమైన హామీ ఇచ్చి ధర్నా విరమించారు. 2 రోజులలో సమస్య పరిస్కారం కాకపోతే రాస్తారోకో చేసి రోడ్ దిగ్బంధం చేస్తాము అని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో రైతులతోపాటు బీజేపీ అయిజ పట్టణ అధ్యక్షులు తెలుగునరసింహ, కిషాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సబ్యులు మేడికొండ భీమ్సేన్ రావు, నాయకులు కంపాటి భగత్ రెడ్డి,ప్రతిప్ స్వామి,లక్ష్మణ్ గౌడ్,తూముకుంట అంజి,ఉప్పల వెంకటేష్, రాజశేఖర్ ,బెల్లంకొండ నాగరాజు ,ప్రతిప్ శెట్టి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు

**- మాజీ మంత్రి కేటీఆర్ కి మట్టి వినాయకుడి విగ్రహం అందజేత**



కాప్రా/సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల మహేందర్ ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి మట్టి వినాయకుడి విగ్రహాన్ని అందజేయడం జరిగింది. ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి గత కొంతకాలంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణహిత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా ప్రజలను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షులు భాషపల్లి నిరంజన్ చారి మడ్డి యుగేందర్ రెడ్డి అలెగ్జాండర్ సంపత్ గౌడ్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. లిమట్టి వినాయకుడు పర్యావరణానికి రక్షణ, భక్తికి ప్రతీకలి అనే సందేశంతో ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో ధర్నా



ములుగు, సెప్టెంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లిబాదం ప్రవీణ్‌లి నాయకత్వంలో బుధవారం జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. డీఎల్ఆర్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరిన మిల్లర్లు బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి, అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పోస్టాఫీసు వద్ద గల ధర్నా చౌక్ లో ధర్నాకు దిగారు. రైస్ మిల్లర్ల భద్రత - రైతుల భవిష్యత్తు. .... నినాదంతో జరిగిన ఈ ధర్నాలో బాదం ప్రవీణ్ మాట్లాడుతూ చిన్న, పెద్ద, మధ్య మిల్లు అనే తేడా లేకుండా అందరూ ఐక్యంగా ఉంటేనే పరిశ్రమను కాపాడుకోగలమన్నారు. మిల్లింగ్ చార్జీని రూ.150 కు, గన్నీ బ్యాగ్ ధరను రూ.11 కు పెంచాలని, పెండింగ్ సివిల్ సప్లైస్, ట్రాన్స్ పోర్ట్, కస్టోడియన్ చార్జీలను వెంటనే చెల్లించాలని, బ్యాంకు రుణాలపై 12 శాతం అపరాధ వడ్డీని మాఫీ చేయాలని, రైస్ మిల్లులను పరిశ్రమగా గుర్తించి 200 హెచ్ పి వరకు ఎల్ టి విద్యుత్ ఇవ్వాలని, ఖరీఫ్ ను రా రైస్ గా, రబీని బాయిల్డ్ రైస్ గా తీసుకోవాలని, ఎఫ్ సి ఐ నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షుడు లిబాదం ప్రవీణ్‌లి తో పాటు సంఘం కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని రైస్ మిల్లర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండారుపల్లి గురుకులాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ బోర్ఖడే హేమంత్ వాసుదేవరావు.



ములుగు సెప్టెంబర్ 10; విజన్ ఆంధ్ర ప్రతినిధి : బండారుపల్లిలోని తెలంగాణ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థుల హాజరు, భోజన పట్టిక, సరుకుల నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతులు, భోజనం, బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, పరిశుభ్రమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు.

## గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి -డి.ఎస్.పి రవీందర్




ములుగు సెప్టెంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గణేష్ ఉత్సవాల్లో మండపాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరి అని డి.ఎస్.పి రవీందర్ తెలిపారు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిరక్షకాధికారి ఆదేశాలతో నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనుమతి లేకుండా మండపాలు పెడితే చర్యలు తప్పవని, భక్తితో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముందుగా పోలీసు స్థావరంలో అనుమతి తీసుకోవాలని, పగలు రాత్రి గస్తీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ సురేష్, ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

- భక్తుల భద్రత.. ప్రజల సౌకర్యమే ప్రధాన లక్ష్యం
- అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి:
- మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



మేడ్చల్ జిల్లా,సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : రానున్న గణేష్ ఉత్సవాలు,నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో ఆయన ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్స్, అంబులెన్సులు, అగ్నిమాపక సదుపాయాలు, లైటింగ్, తగినంత సిబ్బంది, కంట్రోల్ రూమ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

*పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం*

నిమజ్జన ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పూజా సామగ్రి, పూలు, ఇతర వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి సక్రమంగా తరలించాలని ఆదేశించారు. సహజ జల వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ చిన్న విగ్రహాల నిమజ్జనానికి కృత్రిమ బేబీ పాండ్లను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

*విద్యుత్, అగ్నిమాపక భద్రతపై నిఘా*

గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా విద్యుత్, పోలీస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని కమిషనర్ తెలిపారు. అగ్నిమాపక పరికరాలు, వైద్య సహాయం, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి,ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్,ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో,ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి, హైడ్రా అదనపు డైరెక్టర్ పాపయ్య, ఎస్ఈ/డీఈ/ఈఈ సీతా రమేష్, ఎంఎంటీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు,యూబీడీ డైరెక్టర్ సునంద,వివిధ శాఖల ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్లు,భాగ్యనగర్ ఉత్సవ సమితి కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్. శశిధర్, కన్వీనర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వీర తెలంగాణ అగ్ని కణం చిట్యాల ఐలమ్మ కు ఘనంగా నివాళులు

- భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు - ఎం శివశంకర్.



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 10 : తెలంగాణ ప్రాంతంలో జనగామ తాలూకాలో భూస్వాముల గుండాలు నైజాం సైన్యం స్త్రీలపై అఘాయిత్యాలు చేస్తూ ప్రజలను హింసిస్తూ రైతులు పండించుకున్న పంటలను దోచుకెళ్లే క్రమంలో చిట్యాల ఐలమ్మ అగ్ని కణమై తెలంగాణ జన సభ కమ్యూనిస్టుల సహకారంతో వీరోచితంగా పోరాడి పంటను రక్షించుకోవడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివ శంకర్,గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాగర్ కర్నూల్ టౌన్ సమితి ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి హౌసింగ్ బోర్డ్ కాలనీ బస్టాండ్ దగ్గర ఐలమ్మ విగ్రహం వద్ద కోట్ర శేఖర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించడం జరిగినది .అనంతరం ఐలమ్మ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం త్యాగాల ఫలితంగా పేద ప్రజలకు భూములు పంచి రక్షణ కల్పించడంజరిగిందని పేర్కొన్నారు వ్యక్తి చాకిరీ రద్దు చేయబడి ఆత్మగౌరవం భూమిపై హక్కు దక్కిందని తెలిపారు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరుగుబాటు చేయాలని సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరిగే సాయుధ పోరాట వారోత్సవాలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిపిఐ నాగర్ కర్నూల్ టౌన్ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, ఏఐవైఎఫ్ జిల్లాకౌన్సిల్సభ్యులు,ఏం,ఆంజనేయులు,డిహెచ్పిఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ముంకేశ్వరంశీనువాసులు,తదితరులు పాల్గొన్నారు.

# ఆరు ద్విచక్ర వాహనాల చోరీ.. ఇద్దరి అరెస్టు

- రూ.4.20 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం



బోడుప్పల్,సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాహనాల విలువ సుమారు రూ.4.20 లక్షలు ఉంటుందని మేడిపల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ డి జలేందర్ రెడ్డి తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ శ్రీపుర్ కాలనీకి చెందిన వి. విజేందర్ అలియాస్ రాజేంద్ర (30), తుక్కుగూడకు చెందిన బసంత్ ముదులి (22) వాహనాల చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారని,దర్యాప్తులో వీరు ఆరు ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో పాల్గొన్నట్లు వెల్లడైందని తెలిపారు. వారి నుంచి రెండు హోండా యాక్టివా స్కూటర్లు, హీరో స్ప్లెండర్, హీరో ప్యాషన్, హోండా షైన్, జావా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రికవరీ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. క్రైమ్ టీమ్‌కు అభినందనలు కేసులను సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడంతో పాటు చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్న మేడిపల్లి క్రైమ్ టీమ్ సిబ్బందిని ఎస్‌హెచ్‌ఓ జలంధర్ రెడ్డి అభినందించారు.ఈ సంధర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి ద్విచక్ర వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా లాక్ చేయాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా, వాహనం చోరీకి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు స్ఫూర్తిదాయకం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె. అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నగర మేయర్ జి. మమత,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని వారు స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రజక సంఘం నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యను ఆయుధంగా చేసుకొని లక్ష్యాలను సాధించాలి

- ఉద్యోగ సాధనకు పట్టుదలతో కృషి చేయాలి.
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : విద్యను ఆయుధంగా చేసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో నిరంతర కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ సూచించారు.నారాయణపేట జిల్లా కేంద్రంలోని శిలా గార్డెన్స్‌లో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ (ఓ ఎం ఐ ఎఫ్) ఆధ్వర్యంలో జోగినిల పిల్లలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, నిరుపేద మహిళలు, హెల్త్ వర్కర్లకు ఉద్యోగ సాధన, విద్య మరియు ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్య ఒక్క వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబం భవిష్యత్తును మార్చగలిగే శక్తివంతమైన సాధనమని తెలిపారు. విద్యార్థులు, యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా క్రమశిక్షణతో, పట్టుదలతో కష్టపడాలని సూచించారు. చదువుపై ఆసక్తి, ఉద్యోగం సాధించాలనే బలమైన ఆకాంక్ష, నిరంతర శ్రమ ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెప్పారు.ఉద్యోగ సాధనలో ఆకలి ఉండాలని ఎస్పీ సూచించారు. మనకు ఆకలిగా ఉన్నప్పుడు ఆహారం కోసం ఎంతగా ప్రయత్నిస్తామో, అదే విధంగా ఉద్యోగం సాధించాలనే తపన, లక్ష్యాన్ని చేరుకోవాలనే ఆకలి మనలో బలంగా ఉన్నప్పుడే దాని కోసం కష్టపడి పనిచేయగలుగుతామని వివరించారు. కష్టాలు, వైఫల్యాలు ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా వాటిని అనుభవాలుగా తీసుకొని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండాలని ఎస్పీ తెలిపారు. నేను సాధించగలను అనే నమ్మకం మనలో బలంగా ఉన్నప్పుడు, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన కృషి చేయగలుగుతామని అన్నారు. ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న యువత సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుతూ, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నారాయణపేట జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు సహకరించేందుకు త్వరలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పోలీస్ ఉద్యోగాలతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ తదితరాలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడతామని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మహిళలు విద్యను ఆయుధంగా చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం చదువుకుంటుందని, మహిళల విద్యతో కుటుంబంలో విద్యాపట్ల అవగాహన పెరిగి, పిల్లల భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని తెలిపారు. నిరుపేద మహిళలు, యువతులు తమకు అందుబాటులో ఉన్న విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి ఆలోచనా విధానం, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని ఎస్పీ సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ సమయాన్ని చదువు, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సాధనకు కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు మరియు ఇతర లబ్ధిదారులకు ఉద్యోగ సాధనకు సంబంధించిన అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తు ప్రణాళికపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ ఏంజెలా డేవిస్, జిల్లా కోఆర్డినేటర్ ఆజమ్మ, హెల్త్ వర్కర్లు, విద్యార్థులు, మహిళలు, యువత మరియు ఇతరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

- అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం మరువలేనిది.
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 10 : వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. చాకలి ఐలమ్మతెలంగాణలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలని, అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన తెగువ, పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం సమాజానికి ఎల్లప్పుడూస్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్అన్నారు.సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాలకు సామాజిక గౌరవం, సమాన హక్కులు, అభివృద్ధి అవకాశాలు కల్పించడంలో చాకలి ఐలమ్మ వంటిమహనీయుల పోరాటాలు కీలక పాత్ర పోషించాయని కలెక్టర్ తెలిపారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని సూచించారు.చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర, ఆమె పోరాటం, సమాజం పట్ల ఆమెకున్న నిబద్ధతను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఆమె చూపినధైర్యం, ఆత్మగౌరవం, పట్టుదల నేటి తరానికి మార్గదర్శకంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత వంటి రంగాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, బీసీ సంక్షేమ సహాయ అధికారిశ్రీరాములు ,సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# వీరనారి ఐలమ్మ 41వ వర్ధంతి



కాప్రా/సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : సిపిఐఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కమల నగర్ ఆఫీస్ నుంచి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, ఎర్ర అశోక్ ఎం.వినోద జి. శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్. వీరయ్య మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీర వనితని ఐలమ్మను కొనియాడారు తన భూమిలో విసునూరి రామచంద్రారెడ్డి మనుషులు పంటను కోసుకుపోతూ ఉంటే వారికి ఎదురొడ్డి పోరాడిన వీర వనితని తర్వాత కాలంలో ఆంధ్ర మహాసభ సహకారంతో విసునూరి రామచంద్ర రెడ్డి మనుషులను తరిమి కొట్టి తన పంటను కాపాడుకుందని తెలిపారు తర్వాత కాలంలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలోనే దొడ్డి కొమరయ్య తొలి అమరుడయ్యాడని తెలిపారు తర్వాత కాలంలో మహిళల హక్కుల కోసం మహిళ పట్ల చూపుతున్న వివక్ష కోసం ఐలమ్మ పోరాటం చేసిందని తెలిపారు 1947 ఆగస్టులో భారతదేశం అంతటా స్వతంత్రం వచ్చిన తెలంగాణలో మాత్రం నిజాం పాలనలోనే ఉందని నిజాం పాలన దుర్మార్గాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం దాదాపు 5 సంవత్సరాల పాటు జరిగిందని ఈ పోరాటంలో 4,000 మంది పైగా పౌరులు అమరులయ్యారని లక్షలు ఎకరాలు పేదలకు పంచారని గుర్తు చేశారు సాయుధ పోరాటం తర్వాత తెలంగాణలో కమ్యూనిస్టులు బలపడుతున్న సందర్భంగా కేంద్రంలో ఉన్న నెహ్రూ పటేల్ సైన్యాన్ని పంపితే నిజాం సైన్యం ఎలాంటి పోరాటం చేయకుండా సంధీ కుదుర్చుకుని లొంగిపోవడం జరిగిందని తెలిపారు ఈ విషయంలో బిజెపికి ఆర్ఎస్ఎస్ కి ఎలాంటి సంబంధం లేకపోయినా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినమని దానిలో వాళ్ళు పాల్గొన్నట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. ఈ కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి సత్యం కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి ఎర్ర అశోక్ ఎం. వినోద పార్టీ సీనియర్ నాయకులు జి. యాదగిరి రావు, శ్రీమన్నారాయణ, పి.గణేష్, సిహెచ్ ప్రసాదు , బి.వి. సత్యనారాయణ, శివనారాయణ,వెంకటాచారి, జెన్నీ,లీలా వతి ఎం.ఎస్. రావు, టీ.బీ.చారి, శివరామకృష్ణ, బాబురావు, శశాంక్ పాల్గొన్నారు.

# కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పీ. హెచ్. డీ.సాధించిన దీపా బానోత్..!




కాప్రా/సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కాప్రా ఈ.సి.ఐ.ఎల్.కూ చెందిన ఉస్మానియా యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధక విద్యార్థిని శ్రీమతి డా. దీపా బానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయం. డా.దీపా బానోత్ "తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ మరియు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం (తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన పబ్లిక్ మరియు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం)" అనే అంశంపై పరిశోధన జరిగింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తికి తగిన సూచనలను కూడా ప్రతిపాదించారు. ఈ పరిశోధనను డా. వి .సమున్నత గారి పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు సిబ్బంది డా. దీపా బానోత్‌ను అభినందించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను (పెద్ద కుమారుడు ఎం.బి.బి.ఎస్. చిన్న కుమారుడు ఇంజనీరింగ్) చదువుతున్న సమయంలోనూ కుటుంబ భాధ్యతలు చూసుకుంటూ పీహెచ్‌డీ సాధించడం ద్వారా దీపా బానోత్ తన సంకల్పం, పట్టుదల, కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్నా ఉన్నత లక్ష్యాలను సాధించినట్లు నిరూపించారు. ఈ సందర్భంగా డా. దీపా బానోత్ తన విజయానికి సహకరించిన తన భర్త శ్రీ రవి తేజకు, కుటుంబ సభ్యులకు మరియు తన పరిశోధన పర్యవేక్షకురాలు డా.వి. సమున్నతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన సమయంలో వారు అందించిన నిరంతర ప్రోత్సాహం, సహకారం తన పీహెచ్డీ ప్రయాణంలో కీలకమని ఆమె పేర్కొన్నారు. ఆమె సాధించిన ఈ విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# పేదలకు గునిశాలు ఫౌండేషన్ ఆహార పంపిణీ..!




కాప్రా/సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : గునిశాలు ఫౌండేషన్ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో సుమారు 200 మంది పేదలకు ఆహార పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ బి. సంతోషి తన తండ్రి గునిశాలు 26వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. తండ్రి జ్ఞాపకార్థం పేదలు, వృద్ధులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏటా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 200 మంది పేదలకు భోజనం అందించారు. ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు భోజనం అందించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. కేవలం వృద్ధాశ్రమ నిర్వహణకే పరిమితం కాకుండా సమాజంలో అవసరమైన వారికి సేవలు అందించడం అభినందనీయమన్నారు. గునిశాలు జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో కొనసాగిస్తూ పేదలు, వృద్ధులకు అండగా నిలవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గునిశాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది సుంకరి నరేష్, కాంగ్రెస్ నాయకులు పత్తికుమార్, పాతకోటి రామలింగం, సింగం కిరణ్, రామిరెడ్డి, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ ప్రతినిధి రాణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు పేదలకు స్వయంగా భోజనం పంపిణీ చేశారు.

## మహబూబ్‌నగర్ జిల్లా నూతన అటవీ అధికారిగా మందాడి నవీన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



మహబూబ్ నగర్ సెప్టెంబరు 10 విజన్ ఆంధ్ర ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా నూతన జిల్లా అటవీ అధికారిగా (ఐఖీూ) మందాడి నవీన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన అటవీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీ సంరక్షణ, పచ్చదనం పెంపు, వన్యప్రాణుల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. మందాడి నవీన్ రెడ్డి యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (×ఖీూ) 2019 బ్యాచ్‌లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. గతంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో విధులు నిర్వహించిన సమయంలో వేసవి తీవ్రతలో వన్యప్రాణులకు తాగునీటి కొరత లేకుండా అటవీ ప్రాంతంలో సోలార్ బోర్లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా సాసర్ పిట్స్ (నీటి తొట్టెలు) ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ చూపారు. అనంతరం వనపర్తి, జోగులాంబ గద్వాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో జిల్లా అటవీ అధికారిగా విధులు నిర్వహిస్తూ అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణలో విశేష సేవలు అందించారు. మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లాలో అటవీ సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, ప్రాధాన్యతలను వివరించారు. అటవీ భూముల ఆక్రమణలు, అక్రమ చెట్ల నరికివేతపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయడంతో పాటు, జిల్లా వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలకు నూతన వేగం తీసుకువస్తామని తెలిపారు.

## రఘుబాబు 37 వ వర్ధంతి సందర్భంగా "ఏడోగది" నాటిక ప్రదర్శన




హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ): ప్రముఖ సినీ రచయితలు దర్శక నిర్మాతలు పరుచూరి సోదరులు పరుచూరి. వెంకటేశ్వరరావు, డాక్టర్. పరుచూరి గోపాల కృష్ణ నేతృత్వంలో ఏర్పాటు చేసిన పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర్గీయ రఘుబాబు 37 వ వర్ధంతి సందర్భంగా' స్మృత్యంజలి' కార్యక్రమం సోమవారం సాయంత్రం రవీంద్రభారతి, ప్రధాన వేదిక, సైఫాబాద్, హైదరాబాద్ లో సినీ, నాటక ప్రియులు, బంధుమిత్రులు, కళాకారుల సమక్షంలో ఘన నివాళి అర్పించారు. ఈ సంస్మరణ సభ కార్యక్రమానికి సభాధ్యక్షుడుగా ప్రముఖ చలనచిత్ర దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ వ్యవహరించగా, ప్రత్యేక అతిథులుగా విశ్రాంత ఆచార్యులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం డా.డి.యస్. ఎన్. మూర్తి, ప్రముఖ చలనచిత్ర నటుడు తనికెళ్ళ భరణి,అధ్యక్షుడు, తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ వి.ఎన్.ఆదిత్య,యాంకర్ ఝాన్సీ పాల్గొన్నారు. అనంతరం శ్రీజయా ఆర్ట్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పరుచూరి వెంకటేశ్వరరావు రచించిన, డాక్టర్. శ్రీజ సాదినేని దర్శకత్వం వహించిన నాటికలో భార్యాభర్తల బంధం, అన్యోన్యత, నమ్మకం, ప్రేమ, అభిమానం, సహకారం గురించి తెలియజేసే సందేశాత్మక నాటిక "ఏడోగది" ని నటీనటులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంశలను అందుకున్నారు.

# యంగ్ ఇండియా పాఠశాల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ

**- ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి**



కేటి దొడ్డి సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లో విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ముందుకెళ్తోందని భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా కేటి దొడ్డి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకాడమిక్ బ్లాక్, డైనింగ్ హాల్, డార్మెటరీ, స్టాఫ్ క్వార్టర్స్, తదితర భవనాల పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్కూల్ పూర్తి డిజైన్ మ్యాప్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఒప్పందం ప్రకారం భవన నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసి అప్పగించాల్సిందిగా సంబంధిత గుత్తేదారును ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై తహసిల్దార్ తో మాట్లాడారు. మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలను రెండు రోజుల్లోనే మంజూరు చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డు గది తో పాటు వివిధ విభాగాల్లో తిరిగి సిబ్బంది విధులపై ఆరా తీశారు. భూభారతి, సాదా బైనమా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, టీజీ డబ్ల్యూఐడిసి ఏఈ మోహన్ రెడ్డి, తదితరులున్నారు.

## మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా.బి.జ్యోతి మరియు సిబ్బందితో మాట్లాడి, రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా పనితీరును మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం టీకాల నిల్వవుంచే ఐ ఎల్ ఆర్, డీప్ ఫ్రిజర్ లను పరిశీలించి కోల్డ్ చైన్ వ్యవస్థను తనిఖీ చేశారు. ఫార్మసీ, మందుల లభ్యత, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. తదుపరి హెడ్‌క్వార్టర్ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు నాణ్యమైన మరియు మెరుగైన వైద్య సేవలు అందించేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును మరింత పటిష్టం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, సేవల నాణ్యతను పెంచాలని ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి, ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన, సమర్థవంతమైన మరియు ప్రజానుకూల ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని డి ఎం ఎచ్ ఓ, డాక్టర్ బి. రాజా రెడ్డి గారు సూచించారు.

## కాజీపేటలో వైభవంగా కొనసాగుతున్న శ్రీ శ్వేతార్క గణపతి 16 రోజుల నవరాత్రోత్సవాలు

***శాకాంబరీ అలంకరణతో అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు రేపు భక్తగణపతికి విశేష ఆరాధన***



కాజీపేట న్యూస్ సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : కాజీపేటలోని స్వయంభు శ్రీ శ్వేతార్కమూల గణపతి స్వామివారి దివ్యక్షేత్రంలో ప్రారంభమైన 16 రోజుల శ్రీ శ్వేతార్క గణపతి నవరాత్రోత్సవ కళ్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నపూర్ణాదేవికి శాకాంబరీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తదితర సహజసిద్ధమైన పంటలతో అమ్మవారిని అలంకరించి శాకాంబరీ రూపంలో ఆరాధించారు. సమస్త జీవులకు ఆహారం, ఆరోగ్యం, సస్యశ్యామలం, సుఖసంతోషాలు ప్రసాదించాలని ప్రార్థిస్తూ ఈ విశేష పూజను నిర్వహించినట్లు వైదిక నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, తరుణ గణపతి మూలమంత్ర హోమం, ఆవరణార్చన, సహస్రనామార్చన, ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రేపటి కార్యక్రమాలు 11-09-2026 శుక్రవారం నవరాత్రోత్సవాల్లో భాగంగా రేపు భక్తగణపతి ఆరాధన ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. ఉదయం 6:30 గంటలకు శ్రీ స్వామివారికి 108 రకాల తేనెతో అభిషేకం, ఉదయం 8:30 గంటలకు ఆదిగణపతికి చందనాలంకృత గణపతి అలంకరణ, ఉదయం 10:00 గంటలకు భక్తగణపతి మూలమంత్ర హోమం, మధ్యాహ్నం 12:00 గంటలకు బోనంపండు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6:00 గంటలకు భక్తగణపతి ఆవరణార్చన, సహస్రనామార్చన, సహస్ర మోదక (కొబ్బరి) అర్చనలు జరుగుతాయి. సాయంత్రం 7:00 గంటలకు డాన్స్ మాస్టర్ శ్రీమతి పద్మావతమ్మ, హన్మకొండ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తి, మనశ్శాంతి, కుటుంబ సౌఖ్యం, గురుకృప తదితర శుభఫలాలను ఆకాంక్షిస్తూ నిర్వహించే భక్తగణపతి ప్రత్యేక ఆరాధనలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని ఆలయ పరిపాలన నిర్వాహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ కోరారు. వివరాలకు: 93470 80055

## విధులకు గైర్హాజరు.. రికార్డు అసిస్టెంట్‌పై వేటు

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-10(విజన్ ఆంధ్ర) అనుమతి లేకుండా దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ కె.చిరంజీవిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం తెలిపారు. 2025 ఫిబ్రవరి 1 నుంచి ఆయన విధులకు హాజరు కావడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ 2026 ఏప్రిల్ 25న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గైర్హాజరుపై వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించేందుకు చిరంజీవి నిరాకరించడంతో పాటు, ఫోన్‌లో సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలకు స్పందించలేదని కలెక్టర్ తెలిపారు. దీంతో మే 2న ఉత్తర్వులు జారీ చేసి ఆయనను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్1991 ప్రకారం సర్వీసు నుంచి తొలగింపు శిక్ష విధించేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. షోకాజ్ నోటీసు అందిన తేదీ నుంచి 15 రోజుల్లోగా తన వివరణను సమర్పించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా వివరణ ఇవ్వకపోతే అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# అనుమతుల్లేని షెడ్లలో అగ్నిమంటలు...!

**- మూడు ఫుడ్ సెంటర్లు దగ్ధం...తప్పిన పెను ప్రమాదం**
**- భద్రతా ప్రమాణాలపై పలు ప్రశ్నలు**
**- బోడుప్పల్ సర్కిల్ అధికారుల జాడెక్కడ..?**
**- స్థల యజమాని షెడ్లు నిర్మించి వ్యాపారులకు అద్దెకు..? పర్యవేక్షణ ఎక్కడ...?**
**- షార్ట్‌సర్క్యూట్ కారణమంటున్న ఫుడ్ సెంటర్ల యజమానులు..**
**- ప్రాణనష్టం తప్పడంతో ఊపిరిపీల్చుకున్న స్థానికులు..**
**- దర్యాప్తు చేస్తున్న మేడిపల్లి పోలీసులు**

బోడుప్పల్, సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఇప్పుడు పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఒకే ప్రాంతంలో మూడు ఫుడ్ సెంటర్లు మంటల్లో చిక్కుకోవడం, అక్కడ షెడ్లలో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతుండటం, గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తుండటం, అగ్నిమాపక భద్రతా చర్యలు ఎంతవరకు ఉన్నాయన్న అంశాలపై చర్చ జరుగుతోంది. ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కావాల్సి ఉన్నప్పటికీ, అనుమతులు, భద్రతా ప్రమాణాలు, అధికారుల పర్యవేక్షణపై సమగ్ర విచారణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నా.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**మూడు సెంటర్లకు మంటలు.. రెండు సిలిండర్లు దగ్ధం**

ఓ ఫుడ్ సెంటర్‌లో మొదలైన మంటలు తీవ్రతరం కావడంతో పక్కనే ఉన్న యమ్మీ ఫ్రెండ్జ్, శ్రీ అంబిక కిచెన్, ఎస్ఎస్ ఫుడ్ కోర్టు టిఫిన్ సెంటర్లలో మంటలు చెలరేగాయి. నిర్వాహకులు రాత్రి సుమారు 12.15 గంటలకు దుకాణాలను మూసివేసిన అనంతరం ఘటన జరిగినట్లు పోలీసులకు తెలిపారు. విద్యుత్ వైరింగ్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని, మంటల ప్రభావానికి రెండు ఎల్‌పీజీ సిలిండర్లు దగ్ధమైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే 112కు సమాచారం ఇవ్వడంతో రెండు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో దుకాణాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఎవరూ గాయపడలేదు. అయితే మూడు ఫుడ్ సెంటర్లలోని సామగ్రి, ఇతర వస్తువులు దగ్ధమై భారీగా ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. పగటి సమయంలో ఇదే తరహా ప్రమాదం జరిగి ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**అనుమతుల్లేని షెడ్లా?**

ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని స్థలంలో షెడ్లు ఏర్పాటు చేసి వాటిని ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్ల నిర్వహణకు వ్యాపారులకు అద్దెకు ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ షెడ్ల నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎలాంటి అనుమతులు మంజూరయ్యాయి? షెడ్లను ఏ ప్రయోజనం కోసం అనుమతించారు? ప్రస్తుతం జరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఉందా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగి ఉంటే వాటిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నదీ ప్రశ్నగా మారింది. అదే సమయంలో అనుమతులు ఉన్నట్లయితే వాటి నిబంధనలు ఏమిటి, వాణిజ్య కార్యకలాపాలకు అవి వర్తిస్తున్నాయా అన్న అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**స్థల యజమాని షెడ్లు నిర్మించి అద్దెకు ఇచ్చారా?**

స్థల యజమాని ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్లను నిర్మించి వివిధ వ్యాపారులకు అద్దెకు ఇచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అంశాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. నిజంగా అద్దెకు ఇచ్చి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లయితే, ఆయా షెడ్లకు నిర్మాణ అనుమతులు, వాణిజ్య వినియోగ అనుమతులు, విద్యుత్ కనెక్షన్, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, గ్యాస్ వినియోగానికి సంబంధించిన నిబంధనలు పాటించారా అన్నది సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది.
స్థల యజమాని, వ్యాపార నిర్వాహకుల బాధ్యతలు ఏమిటి? సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ ఎక్కడ?**

సర్కిల్ పరిధిలో నిర్మాణాలు, అనుమతులు, నిబంధనల అమలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇలాంటి షెడ్ల నిర్మాణం, వాటిలో కొనసాగుతున్న వాణిజ్య కార్యకలాపాలపై బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్థాయిలో ఎప్పుడైనా తనిఖీలు నిర్వహించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, టీ



స్టాళ్లలో గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ పరికరాలు వినియోగిస్తున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలను పరిశీలించాల్సిన అవసరం మరింత ఉంటుంది. ఈ ప్రాంతంలో గతంలో ఫిర్యాదులు అందాయా? అందితే వాటిపై అధికారులు స్పందించారా? నిర్మాణాలు, షెడ్ల వినియోగంపై ఏవైనా నోటీసులు జారీ చేశారా? అన్న వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.
ప్రమాదం జరిగిన తర్వాతే నిబంధనలపై దృష్టి పెట్టకుండా, ముందస్తు తనిఖీలు జరిగి ఉంటే ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉండేదా? అనే ప్రశ్న స్థానికుల నుంచి వినిపిస్తోంది. అయితే డిప్యూటీ కమిషనర్ లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని చెప్పడానికి ప్రస్తుతం ఆధారాలు లేవు. దర్యాప్తు, అధికారిక తనిఖీల్లో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**భద్రతా ప్రమాణాలపై సమగ్ర తనిఖీ అవసరం**

గ్యాస్ సిలిండర్లు వినియోగించే ఫుడ్ సెంటర్లలో అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉన్నాయా? విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉందా? అత్యవసర సమయంలో బయటకు వెళ్లేందుకు తగిన మార్గాలు ఉన్నాయా? అగ్నిమాపక శాఖకు సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా? వంటి అంశాలపై సంబంధిత శాఖలు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. ఒక ప్రాంతంలో మూడు ఫుడ్ సెంటర్లు ఒకేసారి అగ్నిప్రమాదానికి గురైన నేపథ్యంలో బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఇలాంటి అన్ని షెడ్లు, ఫుడ్ సెంటర్లు, టీ స్టాళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

**పోలీసుల దర్యాప్తు**

ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలపై మేడిపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణమా? మరేదైనా కారణమా? అనే కోణంలో పరిశీలిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఆస్తినష్టం ఎంతమేరకు జరిగింది, రెండు ఎల్‌పీజీ సిలిండర్లు ఎలా దగ్ధమయ్యాయి, షెడ్లకు సంబంధించిన అనుమతులు ఏమిటి, అక్కడ వాణిజ్య కార్యకలాపాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా అన్న అంశాలు కూడా దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- తక్కువ వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**- చెరువుల్లో ముందస్తుగా నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేయాలి**
**- మండపాలకు ఉచిత విద్యుత్తు..**
**- పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం**
**- సమీక్ష సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే నాయిని కీలక సూచనలు..**


హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : వినాయక చవితి, నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. తక్కువ వర్షపాతం కారణంగా ఈసారి నగరంలోని చెరువులు, నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వినాయక చవితి వేడుకల నిర్వహణపై హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ హాల్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై వివిధ శాఖల అధికారులతో నిమజ్జన ఏర్పాట్లు, నీటి వసతి, పారిశుద్ధ్యం, విద్యుత్తు, ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. ఈ ఏడాది గతంతో పోలిస్తే వర్షపాతం తక్కువగా నమోదైనందున నిమజ్జన కార్యక్రమంపై ముందుగానే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ అధికారులు వేగంగా స్పందించి నిమజ్జనానికి అనువైన చెరువులు, నీటి వనరులను గుర్తించాలని సూచించారు. నీటి మట్టం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిమజ్జనానికి అనువుగా నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేపట్టాలని, అవసరమైన చోట్ల నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. భారీ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా క్రేన్లు, ఇతర



అవసరమైన పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. బంధం చెరువులో గుర్రపు డెక్క, పూడికతీత పనులను అధికారులు మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని ఆదేశించారు. నిమజ్జనానికి ముందు చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన మౌలిక వసతులను సిద్ధం చేయాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణ పనులను కేవలం వినాయక నిమజ్జనానికే పరిమితం చేయకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. రానున్న బతుకమ్మ వేడుకలను కూడా దృష్టిలో పెట్టుకుని చెరువుల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, నీటి లభ్యత వంటి అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. నగరంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు ఉచిత విద్యుత్తు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని సూచించారు. మండపాల వద్ద విద్యుత్తు కనెక్షన్లు, వైరింగ్ తదితర అంశాలను సంబంధిత అధికారులు ముందుగానే పరిశీలించాలని, ఎలాంటి విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ ఏడాది నగరంలో గతం కంటే ఎక్కువ సంఖ్యలో వినాయక మండపాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉన్నందున, వాటి వివరాలను ముందుగానే సేకరించి సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు. వినాయక మండపాల పరిసర ప్రాంతాల్లో ప్రతిరోజూ మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. చెత్త తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మండపాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. వినాయక మండపాల సమీపంలో ఆలయం, పాఠశాల, చర్చి, మసీదు వంటి మతపరమైన, విద్యాసంస్థలు ఉంటే నిర్వాహకులకు ముందుగానే అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. శబ్ద వ్యవస్థ వినియోగంలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా వేడుకలు నిర్వహించేలా నిర్వాహకులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అన్ని వర్గాల సహకారంతో వినాయక వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడటం అధికారుల బాధ్యత అని నాయిని పేర్కొన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్, ట్రాఫిక్, జీడబ్ల్యూఎంసీ, విద్యుత్తు, ఆరోగ్య, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నాయిని సూచించారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందుగానే రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని, నిమజ్జన మార్గాల్లో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి సంవత్సరం పండుగలు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో చివరి నిమిషంలో ఏర్పాట్లు చేయకుండా ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే నాయిని అధికారులకు హితవు పలికారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక చవితి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, అవసరమైన వనరులను ముందుగానే సమకూర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఇవి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ అబూబకర్, అదనపు కలెక్టర్ రవి, జి డబ్ల్యూ ఎం సి , టౌన్‌ప్లానింగ్, పోలీస్, విద్యుత్తు, ఆరోగ్య, ట్రాఫిక్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


## శాస్త్రీయ పద్ధతిలో ఎరువులు వినియోగించాలి

***అధికారుల సూచనల మేరకు నానో యూరియా, నానో డీఏపీ వాడాలి.***



ఊట్కూర్, సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర) : రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ఎరువులను వినియోగించాలని నారాయణపేట జిల్లా ఆత్మ డైరెక్టర్, శాంతి నిర్మల, ఊట్కూర్ ఏవో గణేష్ రెడ్డి సూచించారు. గురువారం ఊట్కూర్ మండల పరిధిలోని అమీన్,పూర్ రైతు వేదిక భవనంలో రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు, పంటలకు అందించే పోషకాలు, వినియోగించే విధానం తదితర అంశాలను రైతులకు వివరించారు. అనంతరం రైతు మొగిలి రెడ్డి పొలాన్ని సందర్శించి నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పంటల అవసరాన్ని బట్టి ఎరువులను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు. గణేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో ఎరువులు వినియోగించకుండా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎరువులను విచక్షణారహితంగా వినియోగించడం వల్ల నేల సారంపై ప్రభావం పడే అవకాశం ఉందని, పంటకు అవసరమైన మేరకే ఎరువులు వాడాలని సూచించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకొని అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచు టప్పు నాగేష్, ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి , ఏఈఓ రజిత, మాజీ ఎంపీటీసీ అనిత శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ నోటీసుల పై పక్కాగా నిర్వహించాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి10 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పకడ్బందీగా నిర్వహించాలనీ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీఓటుహక్కుకల్పించడమే లక్ష్యం అని జిల్లా ఎన్నికల అధికారి కె. హైమావతిఅన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డి పల్లి గ్రామంలోని గ్రామపం చాయతీ కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆవరణలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాల వివరాలనుఅధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పకడ్బందీగా నిర్వహించాలని, ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఆధారాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల అందజేత, విచారణ, ఆధారాల నమోదు తదితర ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుకల్పించడమే మన లక్ష్యంగా పనిచేయా లని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఅర్ఓ తహసీల్దార్ సలీం, సర్వే ల్యాండ్ అధికారి సుదర్శన్, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజించు.. పర్యావరణాన్ని రక్షించు

## ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన నివాళి

**వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : భూమి కోసం, భుక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే ఆమెకు నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి కలెక్టర్ తో పాటు ఇతర అధికారులు, రజక సంఘం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1940వ దశకంలో తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయన్నారు. అప్పుడు పోరాటం చేసిన వారిలో ఐలమ్మ లాంటి చాలా కొద్ది మంది మహిళలు ఉన్నప్పటికీ ఆర్మీ లాంటి గేరిల్ల దళాలను ఏర్పాటు చేసి దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పని చేశారన్నారు. ఐలమ్మ జీవిత చరిత్ర భవిష్యత్తు తరాలకు కూడా స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ సమాజానికి ఐలమ్మ చేసిన సేవలకు గుర్తుగా కోఠి ఉమెన్స్ కాలేజీకి ఆమె పేరును పెట్టడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పలువురు వక్తలు కూడా మాట్లాడుతూ ఐలమ్మ ఘనతలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా, బీసీ, రజక సంఘాల నేతలు, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్**



మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్10(విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రభుత్వం. బీసీ వెల్ఫేర్ కమిషనర్ ఇచ్చిన సూచనలు మేరకు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి గురువారం జిల్లా కలెక్టర్,మహబూబాబాద్ అనుమతితో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్ వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ లో చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆమే చూపిన ధైర్య సాహసాలను మరియు స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి ఇంచార్జ్ అధికారి T.A.V నాగలక్ష్మి వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు,IDOC కార్యాలయ సిబ్బంది,మరియు జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## నాణ్యమైన దర్యాప్తు.. పటిష్ట ప్రాసిక్యూషన్.. నేరస్తులకు శిక్షే లక్ష్యం

***ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ (పిఆర్సీ) సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు***




గద్వాల సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు గురువారం ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ (పిఆర్ సి) సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని ముఖ్యమైన, పెండింగ్, కోర్టు విచారణలో ఉన్న కేసుల పురోగతిని కేసుల వారీగా సమీక్షించారు. దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు, చార్జిషీట్ల దాఖలు, సాక్షుల హాజరు, కోర్టు విచారణలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు.ప్రతి కేసులో ఎలాంటి లోపాలకు తావులేకుండా నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించాలని అధికారులకు సూచించారు. దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేస్తూ కేసులను కోర్టులో సమర్థవంతంగా నిరూపించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యమైన కేసుల్లో సాక్షులు, కీలక పత్రాలు, శాస్త్రీయ మరియు సాంకేతిక ఆధారాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నాణ్యమైన దర్యాప్తే పటిష్టమైన ప్రాసిక్యూషన్కు పునాది. ప్రతి కేసును బాధ్యతతో పర్యవేక్షించి, నేరస్తులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు పెండింగ్ కేసులను తగ్గించి, కన్విక్షన్ రేట్ను మరింత పెంచేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ కే. శంకర్, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, సీఐలు,పిఓసిఎస్ఓ.కోర్టు పీపీ విజయ్ కుమార్, ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు పీపీ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత లైజన్ అధికారులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, చెరుకు శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర )సెప్టెంబర్ 10 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలతొగుట మండల కేంద్రంలోభూనిర్వాసితులకు పునరావాసం కల్పించే =&= ప్యాకేజీ అమలు చేయాలని కోర్టు తీర్పు నేపథ్యంలో ఈ విషయం గురించి అహర్నిశలు కృషి చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దుబ్బాక నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. తొగుట,తుక్కాపూర్ గ్రామ భూనిర్వాసితులకు న్యాయం జరిగేలా కోర్టు తీర్పు వెలువడటం హర్షణీయమని ఈ సందర్భంగా భూ నిర్వాసితులు తెలిపారు. తుక్కాపూర్, తొగుట గ్రామ భూనిర్వాసితులకు 123 జీవోతో పాటు ఆరెండర్పునరావా సంపున రావాస పునరుద్ధరణ) ప్యాకేజీ అందించాలని కోర్టు ఆదేశించడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. ఎన్నో ఏళ్లుగా భూములు కోల్పోయి న్యాయం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితుల పోరాటానికి ఈ తీర్పు ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. భూనిర్వాసితుల సమస్యనుపరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి న్యాయమైన పరిహారం, పునరావాసం అందేలా చర్యలుతీసుకుంటుం దని తెలిపారు. కోర్టు తీర్పు నేపథ్యంలో పటాకులు కాల్చిసంబరాలునిర్వహించారుఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ అమర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పంది రాజు, సర్పంచ్ లు ఉప సర్పంచ్లు, డైరెక్టర్లు, భూనిర్వాసితులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## *భగవంతుని దేనిలోకి ఆవహన చేస్తామో, అది పవిత్రమై ఉండాలి. ఆ పవిత్రత మట్టికి ఉంది.*



గద్వాల సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో ) : వినాయక చవితి పర్వదినం అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది.. మట్టి గణపతి బొమ్మను సేకరించుకోవడం. అయితే మట్టి గణపతినే ఎందుకు పూజించాలి ? పూజానంతరం వినాయక ప్రతిమను నీటిలో నిమజ్జనం చేయడం దేనికి ? అనే ప్రశ్నలకు సమాధానం పురాణాల ద్వారా మనకు లభిస్తుంది. ముద్గల పురాణంలో గణేశ చతుర్థి రోజున కేవలం మట్టి గణపతిని మాత్రమే పూజించాలని ఉంది. ఎందుకంటే ఆ తిథి నాడు వచ్చే గణపతి శక్తిని ఆకర్షించే శక్తి ఒక్క మట్టికే ఉంది. భగవంతుని దేనిలోకి ఆవహన చేస్తామో, అది పవిత్రమై ఉండాలి. ఆ పవిత్రత మట్టికి ఉంది. కనుకనే, వినాయక చవితి నాడు మృత్తికా గణపతి పూజను చేస్తుండటం ఆచారంగా వస్తోంది. అలా కాకుండా ఇతరపదార్థాలతో చేసినవి పవిత్రతను నిలుపుకోలేవు. దైవీ శక్తిని ఆకర్షించలేవు. అందుకే మిగతా ఏ లోహాలూ, వస్తువులూ ఏవీ కాకుండా మట్టితో చేసిన గణపతి విగ్రహాన్నే అర్చించండని పౌరాణికులు పదే పదే చెబుతుంటారు. లింగపురాణం ప్రకారం గణపతి విశ్వవ్యాపకత్వాన్ని పరమేశ్వరుడే ప్రకటించాడు. ఈ ప్రకృతికి పునాది అయిన మట్టినుంచి తానే వినాయకుని రూపాన్ని తయారు చేశాడు. మట్టివల్లనే సర్వజీవులకూ పోషణ లభిస్తుంది. ఇక్కడ పుట్టిన సర్వజీవులూ మట్టిలోనే లయమవుతుంటాయి. మృత్తిక పరబ్రహ్మ స్వరూపం, శివారాధనలో కూడా మృత్తికా లింగార్చనకు అత్యంత ప్రాధాన్యం ఉంది. పార్థివ లింగ పూజంటే తనకెంతో ఇష్టమని, శివుడు పార్వతికి చెప్పిన సందర్భం లింగ. పురాణంలో ఉంది. పార్థివ లింగం అంటే మట్టితో చేసిన లింగం, దానికి మిగితా లోహాలతో చేసినవేవీ సాటి రావంటాడు శివుడు. పార్థివ లింగాన్ని అర్చిస్తే, కోరికలు తొందరగా నెరవేరుతాయని పలు పురాణాలు కూడా వివరిస్తున్నాయి. పార్థివ లింగాన్ని అప్పటికప్పుడు చేసి, పూజ ముగియగానే ఉద్వాసన చెప్పి, నిమజ్జనం చేయాలి. శివుడలా చెప్పడానికి కారణం మట్టికున్న పవిత్రతే. అలా పరమశివుడే మట్టి పవిత్రతను స్వయంగా చాటాడు. శివపుత్రుడైన గణపతి పూజను కూడా ఇలాగే మట్టిబొమ్మతోనే చేయాలి. యజ్ఞయాగాది క్రతువుల సమయంలో నదీస్నానం చేస్తారు. అప్పుడు కూడా నదిలోంచి మట్టిని తీసి, ఒంటికి రాసుకుని, శిరస్సున ధరించి, మృత్తికా సూక్తాలు చదివి స్నానం చేస్తారు. పవిత్రత కోసం మట్టితో స్నానమేంటి ? అనే వారికి ఇక్కడ సమాధానం దొరుకుతుంది.

*మృత్తికే హరమే పాపం యన్మయా దుష్కృతం కృతం..*
*మృత్తికే బ్రహ్మదత్తానీ కాశ్యపేనాభి మంత్రితాః*

ఈ శ్లోకం మట్టి విలువను, అందులోని దైవత్వాన్ని తెలియ చెపుతుంది. 'ఓ మృత్తికా ! నేను చేసిన పాపాలను, దుష్కృతాలను నశింపజేయి. నిన్ను బ్రహ్మ సృష్టించాడు. కశ్యప ప్రజాపతి చేత మంత్రపూతమై పవిత్రతను సంతరించుకున్నావు అని మట్టినే కీర్తిస్తోంది ఈ శ్లోకం.

ఇదొక్కటి తెలిస్తే చాలు.... భూమ్మీద పుట్టి నిత్యం మనిషి చేస్తున్న ఆకృత్యాలూ కాలుష్యాలూ అన్నీ ఆగిపోతాయి. నిద్రలేవగానే భూమాతను స్తుతిస్తూ మంచంమీదనుంచి కాలు కింద పెట్టమనేది కూడా నేలతల్లి గొప్పతనం తెలియటం కోసమే. అలాగే పర్వదినాలలో ప్రధానమైన గణేశ చతుర్థి నాడు మట్టి గణపతిని మాత్రమే పూజించమని మన పురాణాలూ ప్రత్యేకంగా బోధించటం వెనుక ఉన్న అంతరార్థం కూడా. పర్యావరణ పరిరక్షణ నేపథ్యమే. ఏ పూజ చేసినా, నూతన కార్యం ప్రారంభించినా. ముందుగా పసుపు ముద్దతో గణపతిని చేసి, ఆ తర్వాత పనిని ప్రారంభిస్తుంటారు. ఒకవేళ పసుపు గణపతిని కొలిచే వీలు లేని పరిస్థితి వస్తే అప్పుడు మట్టిని తెచ్చి ముద్దగా చేసి అందులోకి గణపతి అవహన చేసి పూజించినా, అంతే సమానమైన ఫలితం వస్తుందని పురాణాలు వివరిస్తున్నాయి.

*... జై గణేశాయా...*

## భూ సర్వే ను మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ హేమావతి అధికారులకు సూచన**



సిద్దిపేట సిద్దిపేట జిల్లా ప్రతినిధి10 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) భూముల రీ-సర్వేను మార్గదర్శకాలకు అనుగుణంగాపకడ్బందీగానిర్వహించాలనీ, రైతుల సమక్షంలో భూ హద్దులు, కోఆర్డినేట్లను ఖచ్చితంగా నమోదు చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు.గురువారం చిన్నకోడూర్ మండలం చెర్ల అంకిరెడ్డి పల్లి గ్రామంలోనిగ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన భూ భారతి - భూ సర్వే, రీ-సర్వే అవగాహనకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే 1935 సంవత్సరంలో జరిగింది మళ్లీ 2026 సంవత్సరంలో భూ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి భూములసర్వేనిర్వహించాల్సిఉంటుందనీ తెలిపారు.ప్రభుత్వం ఈ రి-సర్వే కోసం ఆరు ఏడు లక్షలతో అధునాతన పద్ధతులు సర్వే చేయడానికి రోవర్స్ లను కొనుగోలుచేసిందని, దీనివల్ల అత్యంత ఖచ్చితత్వంతో భూములను కొలిచి పగడ్బందీగా హద్దులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూములలో కొనుగోలు చేయడం అమ్మడం మూలంగా సర్వే నంబర్లలో సబ్ నెంబర్లు మారడం, పట్టా ఒకరిది కబ్జాదారులు ఒకరుగా ఉన్నాయని ఇలాంటి సమస్యలకు ఈ రీ-సర్వేలో ఖచ్చితమైన పరిష్కారాన్ని సూచిస్తున్నట్లు అందుకుగాను రైతులు, అధికారులకు సహకారం అందించాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు.రీ సర్వే చేపట్టే ముందు రైతులకు ముందుగానే సమాచారంఅందించాలని, రైతుల సమక్షంలోనే భూముల సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి భూమి హద్దులను, కోఆర్డినేట్లను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని సూచించారు. రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున భూముల హద్దులు, కోఆర్డినేట్ల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రీ సర్వే పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు వారిభూమిక సంబంధించినమ్యాప్నుఖచ్చితమైనకోఆర్డినేట్లతో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ సర్వే ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అధికారి సుదర్శన్, సర్పంచ్ గాలిపల్లి అనిల్, తహసిల్దార్ సలీం, సర్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

**- సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు**
**- సెప్టెంబర్ 11న జరిగే ప్రారంభ వారోత్సవాలకు తక్కళ్లపల్లి రాక**
**- సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి**




హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర,) : నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదేనని, తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. గురువారం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో సిపిఐ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించినా కూడా తెలంగాణ ప్రాంతం నైజాం రాజు ఆధీనంలో ఉండి నియంత, నిరంకుశ పాలన వల్ల భూస్వాములు, పటేల్, పట్వారి లు గ్రామాలలో తమ ఆగడాలు పెట్రేగి పోతున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరి, బానిసత్వంకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూం మొయినుద్దీన్ పిలుపునిచ్చారని తెలిపారు. ఆ పిలుపునందుకుని 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని, 3000 గ్రామాలను విముక్తి చేసిందని, 4500 మంది కమ్యూనిస్టులు తమ రక్తాన్ని చిందించి ప్రపంచ చరిత్రను సృష్టించారని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితమే 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమయిందని కొనియాడారు. నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర ముమ్మాటికి కమ్యూనిస్టులదే అన్నారు. తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, దానిలో భాగంగా సెప్టెంబర్ 11న హనుమకొండ జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ఏకశిల పార్క్ టాను నాయక్ విగ్రహం వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. సెప్టెంబర్ 11న జరిగే ప్రారంభ కార్యక్రమాన్ని, సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రద చేయాలని వారు ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, గుంటి రజిత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టాలు ఎన్ని ఉన్నా జీవించి సాధిద్దాం

**ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం**




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం జెడ్ పి హెచ్ ఎస్ సిద్దాపూర్ హై స్కూల్ లో నిర్వహించడం జరిగింది.కమిషనర్ కుటుంబ సంక్షేమ మరియు ఆరోగ్య శాఖ తెలంగాణ ఆదేశాల మేరకు విద్యాసంస్థల్లో ఆత్మహత్యల నివారణ గురించి కార్యక్రమాలు నిర్వహించాలనే సూచన మేరకు, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విద్యాసంస్థల్లో నిర్వహించాలని డి ఎం హెచ్ ఓ సూచించడం అయినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య హాజరై, ఆత్మహత్యల నివారణ, మానసిక ఆరోగ్యం మరియుచదువులో పిల్లలు ప్రతి ఒక్కరూ ఏ రోజు హోంవర్క్ ఆ రోజే పూర్తి చేయాలని, పిల్లల్లో ఎవరైనా వారికి వారే మాట్లాడుకోవడం, ఒంటరిగా ఉండడం, ఏమన్నా మానసిక ఆరోగ్య సమస్యలు ఇబ్బందులు తలెత్తినట్టయితే తల్లిదండ్రులతో మరియు టీచర్స్ తో పాల్పంచుకోవాలని కోరారు, 14416, 104 టోల్ ఫ్రీ నెంబర్ ల యొక్క ప్రాధాన్యతపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంట ఎన్ సిడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మురళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీపాల్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు (హెడ్ మాస్టర్ ) పాఠశాల ఉపాధ్యాయులువిద్యార్థిని, విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మాట్లాడుదాం వినుదాం అండగా నిలుద్దాం ప్రాణాలను కాపాడుదాం! ప్రతి జీవితం విలువైనదే ఆత్మహత్య నివారణ మనందరి బాధ్యత.

## చిన్న మల్లారెడ్డి లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి




కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 10(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురువారం ఏఈఓ కె శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. చిన్న మల్లారెడ్డి. గ్రామంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ తో ఫర్టిలైజర్ రైతులకు సంబంధించిన పనులను చేసుకోవచ్చని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ తో కలిగే లాభాలను దృష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్ చేసుకుని రైతులు అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దళితులుఇంటికివచ్చారని పసుపునీటితో శుభ్రం చేయించడంసిగ్గుచేటు.

**- తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్.**



నారాయణపేట, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : మాజీ ముఖ్యమంత్రి హోదాకు, ప్రతిపక్ష నాయకుడి స్థాయికి ఇది తగదు కేసీఆర్ వెంటనే దళితులకు క్షమాపణ చెప్పాలి నారాయణపేట్ జిల్లా తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులు తన నివాసానికి వచ్చారనే కారణంతో ఇంటిని పసుపు నీటితో శుభ్రం చేయించారనే ఘటన తీవ్రంగా బాధాకరమని, ఇలాంటి చర్యలను సమాజం సహించదని పేర్కొన్నారు. ఒకవైపు సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతూనే మరోవైపు దళితులు ఇంటికి వచ్చారని ఇల్లు శుభ్రం చేయించడం అత్యంత అభ్యంతరకరమైన చర్య అని విమర్శించారు. ఇలాంటి ఘటనలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. అసెంబ్లీలో దళిత స్పీకర్ను అవమానించిన ఘటనను ప్రజలు ఇంకా మరచిపోకముందే, దళితులు తన నివాసానికి వచ్చారనే కారణంతో ఇంటిని శుభ్రం చేయించారనే విషయం వెలుగులోకి రావడం మరింత బాధాకరమని తెలిపారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ స్థాయికి ఇలాంటి చర్యలు ఏమాత్రం తగవని పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి ప్రవర్తనను మాజీ ముఖ్యమంత్రి నుంచి కోరుకోవడం లేదన్నారు. దళితులు సమాజంలో సమాన గౌరవం, సమాన హక్కులు కలిగిన పౌరులని, వారి పట్ల ఎలాంటి వివక్షకైనా తావు ఉండకూడదని అన్నారు. ఈ ఘటనపై కేసీఆర్ వెంటనే దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన వెనుకబడిన శాఖ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 09 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా బుదవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో అధికారికంగానిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ హాజరై కాలోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.తెలంగాణమాండలికంలో సామాజిక రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజి నారాయణరావు అని ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతోగౌరవించిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూభావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందనితెలిపారుఈకార్యక్రమంలో ఎస్ డి సి సుదర్శన్ రెడ్డి, డిబిసిడిఓ హమీద్, డిసిఎస్ఓ తనూజ, ఐఅండ్ పిఆర్ డివై ఈఈ భూపాల్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డిటిఓ, డీఎస్సీడీవో, తదితరులు పాల్గొన్నారు.

## కారులో ప్రయాణిస్తున్న వారికి తప్పిన పెను ప్రమాదం



భూపాలపల్లి జిల్లా బ్యూరో: 10 సెప్టెంబర్ విజన్ ఆంధ్ర : భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం కర్కపల్లి గ్రామం వద్ద 353 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ను ఢీ కొన్న బ్రీజా ఖా 25 జ 0886 నంబర్ గల కారు అదుపుతప్పి కర్కపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను ఢీ కొట్టింది. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అప్పటికే పాఠశాల సమయం ముగిసి విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

**- రైతాంగ పోరాటంలో ధైర్యానికి ప్రతీక**
**- సామాజిక మార్పునకు నాంది పలికిన ధైర్యశాలి**
**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-09(విజన్ ఆంధ్ర) : సమానత్వం, హక్కుల సాధన కోసం వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల భూమి, భుక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక మార్పునకు నాంది పలికిన ధైర్యశాలిగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 1895 సెప్టెంబరు 26న వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కృష్ణాపురంలో జన్మించిన ఐలమ్మ.. 194044 మధ్యకాలంలో విస్నూర్ దేశ్‌ముఖ్, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఎదురు నిలిచి తెలంగాణ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ,జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

# వీరా నారి చాకలి ఐలమ్మ పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకం....

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు**



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి నీ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. రిమ్స్ ఎదుట గల ఐలమ్మ విగ్రహానికి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ తదితర కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్,జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్,అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ కిజార్ పాషా, జిల్లా పబ్లిసిటీ కోఆర్డినేటర్ మేకల జితేందర్, డీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, డీసీసీ కార్యదర్శి హిమ అభిషేక్,తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం, చూపిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

**- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా సందర్శించిన**
**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



కేటీ దొడ్డి సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాత ప్రశ్న పత్రాలను పునఃశ్చరణ చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. గతేడాది ఫలితాలపై ఆరా తీసి ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక అత్యధిక విద్యార్థులు 500కు పైగా మార్కులు పొందాలని ఆకాంక్షించారు. త్వరలో జరగబోయే ఎస్ఎ1 పరీక్షల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థుల దినచర్యను తెలుసుకొని వారికి విద్యాలయంలో కల్పించిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంట, స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కేజీబీవీకి సంబంధించిన హాజరు, ఇతర రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# గుడ్డెందొడ్డి రిజర్వాయర్ 1.19 టిఎంసి.నుండి 15 టిఎంసి.లకు పెంపు


**- జీవో కాపీని గద్వాల ఎమ్మెల్యే కు అందజేసిన నీటిపారుదల శాఖ మంత్రి**




గద్వాల సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ నందు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం గుడ్డెందొడ్డి రిజర్వాయర్ 1.19 టిఎంసి. నుండి 15 టిఎంసి. ల సమర్థ్యం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి జీవో కాపీని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ రైతాంగం ప్రజల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేకంగా గద్వాల నియోజకవర్గానికి సంబంధించిన నీటిపారుదల గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లకు నిధులు కేటాయించడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. రైతాంగానికి శాశ్వతమైన నీటి సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించడం జరిగిందని తెలిపారు. రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించే విధంగా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయడం రైతాంగానికి ఎంతో మేలు చేసిన విధంగా ఉన్నదని తెలిపారు. భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గం కృషి చేయాలని గద్వాల నియోజకవర్గం రాష్ట్రంలోనె నెంబర్ వన్ స్థానంలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కి, మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, జూపల్లి కృష్ణారావు కి గద్వాల నియోజకవర్గ ప్రజల తరపున రైతాంగం తరపున హృదయపూర్వక ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు ఆలూరు రామయ్య శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది లేక.. పౌర సేవా కేంద్రానికి తాళం!

**- బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజలకు తప్పని తిప్పలు..**
**- పెన్షన్ నుంచి టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల వరకు నిలిచిన సేవలు**
**- వినాయక విగ్రహాలతో నిండిన సేవా కేంద్రం..**
**- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ప్రజల అవస్థలు**








బోడుప్పల్,సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను అందించాల్సిన బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రం సిబ్బంది కొరతతో మూతపడటం ప్రజలకు ఇబ్బందిగా మారింది. పింఛన్ దరఖాస్తులు, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, ఆస్తి, పౌర సమస్యలపై వినతులు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు సేవలు అందక ఇక్కట్లు తప్పడం లేదు. మరోవైపు సేవా కేంద్రం ఉన్న గదిలో వినాయక విగ్రహాలను ఉంచడంతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది.

**పెన్షన్ కోసం వచ్చి.. నిరాశతో వెనుదిరుగు**

కొత్తగా పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు, ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల స్థితిని తెలుసుకునేందుకు వృద్ధులు, మహిళలు కార్యాలయానికి వస్తున్నారు. అయితే కేంద్రంలో సిబ్బంది లేకపోవడంతో వారి దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగడం లేదని బాధితులు చెబుతున్నారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో ఉన్న వారు పలుమార్లు కార్యాలయానికి తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు కార్యాలయానికి వచ్చి ఖాళీ చేతులతో వెనుదిరిగే పరిస్థితి లేకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పౌర సేవల కోసం ఏర్పాటు చేసిన కేంద్రం సిబ్బంది కొరతతో మూతపడటం, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశంగా మారింది.

**టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులకు దిక్కేది?**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అనుమతి లేని నిర్మాణాలు, అక్రమ షెడ్లు, భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై ప్రజలు తరచూ ఫిర్యాదులు చేసేందుకు వస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు అందజేసి సమస్యను పరిష్కరించు కోవాలనుకునే వారికి పౌర సేవా కేంద్రం మూసివేయడం ఇబ్బందిగా మారింది. ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కాకుండా పేరుకుపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఒక్క కేంద్రం.. ఎన్నో సేవలు**

పౌర సేవా కేంద్రం ద్వారా ప్రజలకు అందే వివిధ సేవలకు అంతరాయం ఏర్పడటంతో సాధారణ పౌరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్ దరఖాస్తులు, టౌన్‌ప్లానింగ్ అంశాలు మాత్రమే కాకుండా పౌర సమస్యలపై వినతులు, ధ్రువపత్రాలకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర ప్రభుత్వ సేవల కోసం వచ్చే వారు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.

**విగ్రహాలతో సేవా కేంద్రం**

వినాయక చవితి నేపథ్యంలో సేవా కేంద్రం ఉన్న గదిలో వినాయక విగ్రహాలను ఉంచారు. పండుగ ఏర్పాట్ల కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని వినియోగించవచ్చని, ప్రజలకు సేవలందించే కేంద్రాన్ని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. పండుగ ఏర్పాట్లు ఒకవైపు, ప్రజా సేవలు మరోవైపు కొనసాగించేలా అధికారులు సమన్వయం చేయాలని కోరుతున్నారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి**

సిబ్బంది కొరత ఉంటే తాత్కాలికంగానైనా ఇతర విభాగాల నుంచి సిబ్బందిని కేటాయించి సేవలను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. పౌర సేవా కేంద్రం అందుబాటులో లేని సమయంలో ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

# సెప్టెంబర్ 12 జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక శ్రద్ధ

**- గణేష్ నవరాత్రులకు ముందస్తు భద్రతా చర్యలు**
**- గంజాయి, జూదం, ఇసుక అక్రమ రవాణా,పిడిఎస్. రైస్ ల పై కఠిన చర్యలు**
**- పోలీసు అధికారులతో నెలసరి సమీక్ష సమావేశం**
**- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



గద్వాల సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు (ఐపీఎస్) జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, బీట్ సిస్టమ్, పెట్రోలింగ్, సిసిటిఎన్ఎస్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. దర్యాప్తులో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించబోమని, విధుల్లో అలసత్వం వహించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలను ముందుగానే గుర్తించి అడ్డుకునే విధంగా పోలీసింగ్ ఉండాలని, బీట్ సిస్టమ్‌ను మరింత పటిష్టం చేసి ప్రతి గ్రామం, కాలనీపై నిరంతర నిఘా ఉండేలా చూడాలని ఆదేశించారు. బీట్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. అదేవిధంగా బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల ద్వారా రాత్రి వేళల్లోనూ నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిసిటిఎన్ఎస్. సిబ్బంది శాంతినగర్ సర్కిల్ తులసిరామ్ నాయుడు, శాంతినగర్ పీస్- మస్తాన్, మనోపాడ్ పీస్-సుజాత, రాజోలి పీస్-పహ్లాద్ రెడ్డి, అయిజ పీస్-ఆకాష్ , అలంపూర్ సర్కిల్ - రవి, అలంపూర్ పీస్ - మహేష్, కోదండపూర్ పీస్ - రాంబాబు, ఇటిక్యాల పీస్ - మహేష్ ఉండవెల్లి పీస్ - సంతోషమ్మ, గద్వాల్ సర్కిల్ - దామోదర్ రెడ్డి, గద్వాల్ టౌన్ - రమేష్ బాబు, గద్వాల్ రూరల్ - రఘునాథ్ రెడ్డి, ధరూర్ - దనేశ్వరి, గట్టు - ప్రభాకర్, మాల్దాకల్ - విజయ్ రాజు లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే అక్రమ గంజాయి రవాణా, ఇసుక అక్రమ రవాణా,పిడిఎస్. రైస్, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, దొంగిలించబడిన సొత్తును రికవరీ చేసి బాధితులకు అందించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లాలోని సర్కిల్ ఆఫీసర్లకు, ఎస్సై లకు సూచించారు. రాజీ ద్వారా పరిష్కరించదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలకు అవగాహన కల్పిస్తూ న్యాయశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న గణేష్ నవరాత్రుల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులు ప్రతి మండపం డీటెయిల్స్ లైన్లో అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గణేష్ మండపాలు, నిమజ్జన కార్యక్రమాలు, ట్రాఫిక్, ప్రజల రాకపోకలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకుని సంబంధిత శాఖలు, నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చైల్డ్ అండ్ ఉమెన్ సేఫ్టీ కార్యక్రమాలను, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీఎస్పీ గద్వాల వై. మొగిలయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిసిటిఎన్ఎస్. సిబ్బంది, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# వెంకటాపూర్ ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకోవడంలో అలసత్వం ఎందుకు...?

**- రెవెన్యూ అధికారులను ప్రశ్నించిన సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి**
**- హనుమకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా**




హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : అయినవోలు మండలం వెంకటాపురం గ్రామం సర్వేనెంబర్ 324 లో అక్రమంగా పట్టాలు చేయించుకున్న 138.32 ఎకరంల అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకోవడంలో అధికారులు గత కొంతకాలంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే అక్రమ పట్టాలను రద్దు పరచి, అట్టి భూమిని స్వాధీనపరచుకొని భూమిలేని నిరుపేదలకు ఇవ్వాలని కోరుతూ గురువారం హనుమకొండ ఆర్డీఓ కార్యాలయం ముందు సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పేదలతో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ సదరు భూమికి సంబంధించి గత సంవత్సర కాలంగా పేదల పక్షాన సిపిఐ కొట్లాడుతున్నదని, ఆరు నెలల క్రితం గత అసెంబ్లీ సమావేశాల్లో సిపిఐ శాసనసభ్యులు కోణం లేని సాంబశివరావు ఇట్టి భూ అక్రమనకు సంబంధించి చర్చ చేసిన ఫలితంగా జిల్లా అధికార యంత్రాంగం లో కదలిక వచ్చి అట్టి భూమిని సర్వే చేసి వదిలేసారని ఈ సందర్భంగా వాపోయారు. సర్వేలో ఆ భూమిని మొత్తంగా ప్రభుత్వ భూమిగా గుర్తించినట్టు జిల్లా కలెక్టర్ తో సహా మండల స్థాయి రెవెన్యూ అధికారుల వరకు మౌఖికంగా చెబుతున్నప్పటికీ ఆక్రమణదారుల పట్టాలను రద్దు చేయడంలో కాలాతీతం చేస్తున్నందున అట్టి భూమిపై రాబోవు రోజుల్లో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ధర్నా కార్యక్రమం అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారిని ఇదే విషయమై కలువగా ఆర్డీవో మాట్లాడుతూ తక్షణమే ఈ విషయంలో చర్యలు గైకొంటామని, వారం రోజుల్లో ఆక్రమణదారుల పట్టాలను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీని ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని, కోట్లాది రూపాయల విలువైన భూమిని కాపాడుతూ భూమిలేని పేదలకు జీవనాధారాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకులు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్,జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,నాయకులు ఎదునూరి వెంకట్ రాజం, కొట్టెపాక రవి, మాదాసి యాకుబ్, పాము రమా, బండి సరిత,బొట్టు బిక్షపతి,రామారావు, జ్యోతి, పోశవ్వ, లక్ష్మి, అల్వాల రాజు తదితరులతోపాటు పెద్ద ఎత్తున పేదలు పాల్గొన్నారు.

# శక్తి సదన్ - స్వాధార్ గృహ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10, ( విజన్ ఆంధ్ర ) : జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం నగరంలోని శక్తి సదన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కలెక్టర్ శక్తి సదన్ లోని వసతులను పరిశీలించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న ఇన్‌మేట్స్ తో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం శక్తి సదన్ లో నిర్వహిస్తున్న అడ్మిషన్స్ రిజిస్టర్,స్టాఫ్ రిజిస్టర్, ఇన్‌మేట్స్ అటెండెన్స్ రిజిస్టర్, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గృహ్ లో అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ వంటి వృత్తి విద్యా కోర్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఇన్‌మేట్స్ కు అందిస్తున్న భోజన మెనూ గురించి, తాగునీరు ఎక్కడి నుండి అందిస్తున్నారు, నాణ్యత ఎలా ఉంది అనే విషయాలపై సిబ్బందిని ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్‌మేట్స్ తో ఇంటరాక్ట్ అయ్యి...అందరూ తమ చదువులను పూర్తి చేసుకోవాలని, చదువు పూర్తయిన తర్వాత వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించి, వారు స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎమ్. విశ్వజా, ఈ.వో. ఆశాదేవి,శక్తి సదాన్ సూపరింటెండెంట్ శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించండి

**- రవాణా శాఖ మంత్రి కి వినతి పత్రం అందజేసిన అలంపూర్ ఎమ్మెల్యే**



అలంపూర్ సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : హైదరాబాదులోని రవాణా శాఖ మంత్రి కార్యాలయము నందు అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలసి అలంపూర్ నియోజకవర్గ ప్రజలు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని అన్నారు.అలంపూర్ శ రోడ్‌లో మినీ బస్ డిపో ఏర్పాటు చేయాలని,డిపో పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వెహికల్ (ఇవి) ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలిని కోరమని అన్నారు అయిజ బస్ టెర్మినల్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. అలంపూర్ నియోజకవర్గంలో బస్సుల సంఖ్యను పెంచి, గ్రామీణ ప్రాంతాలకు కూడా మెరుగైన బస్సు సౌకర్యం కల్పించాలి.విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, గ్రామీణ ప్రజలకు సమయానుకూలంగా బస్సు సర్వీసులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇట్టి విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించాలని తెలియజేశారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక



# వీర నారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలి....

**మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్**






ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఆదిలాబాద్ పట్టణం లోని రిమ్స్ మెడికల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆమె విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, జాయింట్ కలెక్టర్ చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష సతీష్ లతోకలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ముఖ్య అతిథిగా పాల్గొని, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిణి సునీత కుమారి , మున్సిపల్ కమీషనర్ జగదీష్ గౌడ్ , బీసీ సంఘం నాయకులు చిక్కల దత్తు, కలాల శ్రీనివాస్ , రజక సంఘం అధ్యక్షులు కార్తీక్, తదితరులు పాల్గొని ఐలమ్మ ఆశయాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి,పుర అధ్యక్షురాలు బండారి అనూష సతీష్ లు మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి చాకలి ఐలమ్మ ప్రతీక అని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన ఆమె తెలంగాణ ప్రజలందరికీ ఆదర్శమని వారి ఆశయసాధనకు ప్రతీ ఒక్కరం కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.

## చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**- అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్...**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10:(విజన్ ఆంధ్ర) అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం మరియు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ ,ఆమె పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మంగ లతతో కలిసి అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ప్రజల భూమి హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం మరియు ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, వారి పోరాటపటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి సంక్షేమ శాఖ అధికారి నదీం మాజీద్, బి సి సంఘం నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిడబ్ల్యూఎసి 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




హైదరాబాద్, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్(జిడబ్ల్యూఎసి) 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అల్ కుజ్‌లోని డల్స్క అరేనా ఇండోర్ హాల్‌లోఘనంగా జరిగాయని జిడబ్ల్యూఎసి వ్యవస్థాపక అధ్యక్షులు ధోనికిని కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత కాన్సులేట్ కాన్సుల్ జనరల్ ఇమ్మడి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని గల్ఫ్ కార్మికుల సమస్యలు, సంక్షేమం, భవిష్యత్ అవకాశాలపై సుమారు 45 నిమిషాలు ప్రసంగించారని తెలిపారు. ఇండియా నుంచి ప్రత్యేకంగా వచ్చిన రేలా రేలా సింగర్ గంగా సిస్టర్ కార్యక్రమంలో పాల్గొని ఆకర్షణగా నిలిచినట్లు చెప్పారు. తెలంగాణ గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సహాయనిధి ఫౌండేషన్ సభ్యుల తోపాటు ఫౌండేషన్ తరపున అధ్యక్షులు తోకల శంకర్, ఉపాధ్యక్షులు బింగి రాజు, ప్రధాన కార్యదర్శి పల్లికొండ గంగనర్సయ్య, కార్యదర్శి బింగి నరసయ్య, కోశాధికారి బింగి పోశన్న, బహ్రెయిన్ ఉపాధ్యక్షులు దేశబోయిన గంగాధర్, గౌరవ సలహాదారులు పుట్టి రాజు, ఊట్నూరి రాజనర్సయ్య, మాజీ అధ్యక్షులు సముద్రాల తిరుపతి, పోశెట్టి, పల్లికొండ రాములు, ఇంటెప్పు నరేష్, జుంబర్తి నరేష్, కల్లెడ మహేష్, పల్లికొండ అనిల్, బింగి పవన్, పందిరి తిరుపతి, కల్లెడ రాకేష్, పందిరి రాజు, పల్లికొండ హరీష్, బోనగిరి అఖిల్, బోరే సురేష్, దండెం కొండయ్య, కల్లెడ భూమన్న, గడ్డం నవీన్ హాజరైనట్లు తెలిపారు.

## శాయంపేట పోచమ్మ బోనాల్లో ఎమ్మెల్యే నాయిని

**- రూ.90.50 లక్షలతో నిర్మించిన పోచమ్మ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : శాయంపేటలో నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రూ.90.50 లక్షల వ్యయంతో నిర్మించిన పోచమ్మ రోడ్డును ప్రారంభించారు. ఎన్నాళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు పరిష్కారం చూపుతూ నాణ్యతతో రహదారి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం, తన కార్యాలయం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని నాయిని రాజేందర్ రెడ్డి గారు స్పష్టం చేశారు. శాయంపేటలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.వచ్చే ఏడాది వరకు పోచమ్మ ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.ఈ వేడుకలో కూడా చైర్మన్ గుండు సుధారాణి,పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు,మోహన్ రావు,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,నాయకులు రాజు,సురేష్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న ఎంతటి వారైనా వదలం.... డీఎస్పీ జీవన్ రెడ్డి

- రాంపూర్-టి ల్యాండ్ గ్రాబింగ్ కేసులో కీలక అప్డేట్
- నకిలీ వారసత్వ ధృవీకరణ పత్రంతో భూమి కబ్జాకు యత్నం
- ఒకరోజు పోలీస్ కస్టడీలో కీలక వివరాలు వెలుగులోకి.. డాక్యుమెంట్ రైటర్ అరెస్ట్....
- ఆదిలాబాద్ డిఎస్పి ఎల్. జీవన్ రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)ఆదిలాబాద్ జిల్లా జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్-టి గ్రామంలో నకిలీ పత్రాలు, తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా వారసత్వ వ్యవసాయ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితుడు మహమ్మద్ ఇబ్రహీం అక్బానీ ఏ మామ్లా సేఠ్‌ను ఒకరోజు కస్టడీలోకి తీసుకుని విచారించగా, నకిలీ పత్రాల తయారీలో డాక్యుమెంట్ రైటర్ మహమ్మద్ ఫైజుద్దీన్ సిద్ధిఖీ ఏ సాహెర్ పాత్రపై కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. విచారణలో వెల్లడైన వివరాల ఆధారంగా డాక్యుమెంట్ రైటర్ మహమ్మద్ ఫైజుద్దీన్ సిద్ధిఖీ ఏ సాహెర్‌ను బుధవారం అరెస్ట్ చేసి, గురువారం న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. నకిలీ వారసత్వ ధృవీకరణ పత్రాలు, ఇతర పత్రాలను సృష్టించడంలో అతని పాత్ర ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు వివరించారు. భూమి యజమాని సయ్యద్ సఫ్దర్ అలీ ఈ సంవత్సరం భూమికి సంబంధించిన వాల్యుయేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయగా, తన పేరుపై ఉన్న భూమి ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డిఎస్పి తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మహేష్ కుమార్ ఖేతాన్ విచారించగా, మహమ్మద్ ఇబ్రహీం అక్బానీ ఏ మామ్లా సేఠ్, సూరజ్ సేఠ్ మధ్యవర్తులుగా వ్యవహరించి, నకిలీ పత్రాలు సృష్టించి భూమిపై అక్రమ హక్కులు సృష్టించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు.నకిలీ పత్రాల తయారీకి సహకరించిన డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై కూడా సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు ముందు సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బందికి సూచించారు. ప్రజలు భూములు, ప్లాట్లు కొనుగోలు చేసే ముందు యాజమాన్య హక్కులు, వారసత్వ పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు మరియు సంబంధిత రికార్డులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు.ల్యాండ్ గ్రాబర్స్ ఎంతటి వారైనా, ఎన్ని సంవత్సరాల క్రితం నకిలీ పత్రాలు సృష్టించినా చట్టపరమైన చర్యలు తప్పవని డిఎస్పి ఎల్. జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. నకిలీ పత్రాల ద్వారా భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉట్ల గణపతికి వారసత్వ సర్టిఫికెట్ మంజూరు చేసిన రెవెన్యూ సిబ్బంది పాత్ర పై సైతం విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణం మరియు జిల్లాలో బడా రియల్టర్ల మోసాలకు గురైన బాధితులు భయపడకుండా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని డిఎస్పి సూచించారు. బాధితులకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ చట్ట ప్రకారం న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పారిశ్రామిక పార్కు భూసేకరణపై అపోహలు వద్దు...జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని రాంపూర్ (టీ), గిమ్మ (బీ), గూడ, హత్తిఘాట్ గ్రామాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు చేపడుతున్న భూసేకరణకు సంబంధించి సెప్టెంబర్ 9న ఒక దినపత్రికలో ప్రచురితమైన కథనంలో వాస్తవాలు సరిగా ప్రతిబింబించలేదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. నాలుగు గ్రామాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు మొత్తం 2,062.01 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఎం/ఎస్ జి.ఎస్. బయోటెక్ సంస్థకు చెందిన కొన్ని భూములను రుణ బకాయిల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసిందన్నారు.అయితే, ఈడీ అటాచ్ చేసిన 500 ఎకరాలకు పైగా భూమిని సేకరిస్తున్నట్లు కథనంలో పేర్కొనడం వాస్తవం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్‌సీఎల్‌టీ లిక్విడేటర్ అందించిన జాబితా ప్రకారం, ఈడీ అటాచ్ చేసిన భూముల్లో కేవలం 47.22 ఎకరాలు మాత్రమే ప్రస్తుత భూసేకరణ ప్రతిపాదనల్లో ఉన్నాయని తెలిపారు. గ్రామాల వారీగా భూముల వివరాలు....

- గూడ: 259.23 ఎకరాలు సేకరణకు ప్రతిపాదించగా, ఇందులో ఈడీ అటాచ్ చేసిన భూమి 37.23 ఎకరాలు.
- రాంపూర్ (టీ): 333.38 ఎకరాలు సేకరణకు ప్రతిపాదించగా, ఇందులో ఈడీ అటాచ్ చేసిన భూమి 9.39 ఎకరాలు.
- గిమ్మ (బీ): 274.09 ఎకరాలు సేకరణకు ప్రతిపాదించగా, ఇందులో ఈడీ అటాచ్ చేసిన భూమి లేదు. హత్తిఘాట్: 1,149.11 ఎకరాలు సేకరణకు ప్రతిపాదించగా, ఇందులో ఈడీ అటాచ్ చేసిన భూమి లేదు.

మొత్తంగా 2,062.01 ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదించగా, అందులో ఈడీ అటాచ్ చేసిన భూమి 47.22 ఎకరాలు మాత్రమేనని, భూములను సేకరిస్తున్నారంటూ కథనంలో పేర్కొన్న అంశాలు అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. వాస్తవాలను పూర్తిగా పరిశీలించకుండా ఇలాంటి కథనాలు ప్రచురించడం వల్ల భూ యజమానులు, ప్రజల్లో అనవసరమైన అపోహలు, ఆందోళనలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియ చట్ట నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. భూమికి సంబంధించి ఏదైనా టైటిల్ వివాదం ఉన్నట్లయితే =ఖీఙూూ== చట్టం2013, తెలంగాణ సవరణ చట్టం2016 నిబంధనల ప్రకారం తగిన పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన వాస్తవాలను ప్రజలు గమనించాలని, అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

**మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ధైర్యసాహసాలకు,ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ధీరవనిత అని అన్నారు.సామాజికంగా, ఆర్థికంగా అణగారిన వర్గాలపై భూస్వామ్య వ్యవస్థ సాగించిన దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఆమె చూపిన తెగువ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.పాలకుర్తి ప్రాంతంలో తన కష్టార్జిత పంటను భూస్వాముల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకునేందుకు ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ రైతాంగ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. నిజాం పాలనలో భూస్వామ్య దౌర్జన్యాలు, వెట్టిచాకిరీ, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఆమె వెనుకడుగు వేయకుండా పోరాడారని తెలిపారు.ఒక సాధారణ మహిళగా ప్రారంభమైన ఆమె పోరాటం క్రమంగా వేలాది మంది రైతులు, పేదలు, కూలీలలో చైతన్యం నింపిందన్నారు. ఐలమ్మ ధైర్యం కేవలం ఒక కుటుంబానికి లేదా ఒక గ్రామానికి సంబంధించిన పోరాటం కాదని, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు తమ హక్కుల కోసం నిలబడాలనే సందేశాన్ని ఇచ్చిన చారిత్రక ఉద్యమమని విజయ్ భాస్కర్ అన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ఆమె జీవితం స్ఫూర్తిదాయకమని,నేటి యువత ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.తెలంగాణ చరిత్రలో ఐలమ్మ పేరు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని,ఆమె త్యాగాలు,పోరాటం, ఆత్మగౌరవ భావనను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, పేదల హక్కుల కోసం నిరంతరం కృషి చేయడమే ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం కూడా ఐలమ్మ జ్ఞాపకాలను అధికారికంగా గౌరవిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.కార్యక్రమంలో తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, చాగంటి రమేష్, వడ్డేపల్లి రమేష్, మేకల బాపూరావు, సంపత్, రవీందర్‌రావు, రఘు, వరుణ్, రామ్మూర్తి, శ్రీధర్, శ్రీనివాస్, పుల్లయ్య, మతిన్, గౌస్, రాజు, ఉదిత్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భావితరాలకు పోరాట స్ఫూర్తి వీరనారి చాకలి ఐలమ్మ

**- మహిళా సాధికారత, సామాజిక న్యాయం దిశగా ప్రభుత్వం కృషి**

**- కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని న్యూ శాయంపేట జంక్షన్ లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, అధికారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. గురువారం వీరనారి చాకలి(చిట్యాల) ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని న్యూ శాయంపేట జంక్షన్ లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, అధికారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కుడా ఛైర్ పర్సన్ సుధారాణి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గం కోసం పోరాడిన మహిళ కాదని, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం మహిళా సాధికారతకు, ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చేయూత నిస్తోందన్నారు. పోరాటయోధుల త్యాగాలు, పోరాటాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, ఆమె స్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఎన్. రవి, వై వి గణేష్, ఎల్ కిషోర్ కుమార్, వరంగల్ ఆర్డీవో సుమ, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, లక్ష్మణ్, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, డాక్టర్ మధుచందర్, మాజీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మాజీ కార్పొరేటర్ చీకటి ఆనంద్, మున్సిపల్, కుడా, ఇతర శాఖల అధికారులతో పాటు ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 'యాక్ట్ విత్ స్పీడ్'తో యాక్సిస్ బ్యాంక్ స్పర్ష్ వీక్

**- యాక్సిస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ అమితాబ్ చౌదరి**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర): కస్టమర్లతో సంబంధాలను బలోపేతం చేసేందుకు యాక్సిస్ బ్యాంక్ సెప్టెంబర్ 7-11 వరకు 'స్పర్ష్ వీక్-2026' నిర్వహిస్తున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ అమితాబ్ చౌదరి గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'యాక్ట్ విత్ స్పీడ్' థీమ్‌తో దేశ వ్యాప్తంగా 2.5 లక్షలకుపైగా కస్టమర్ల అభిప్రాయాలను సేకరించి వేగంగా చర్యలు తీసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 90 మందికిపైగా ఉన్నతాధికారులు బ్రాంచ్‌లు, లోన్ సెంటర్లను సందర్శించనున్నారు. కస్టమర్ల అభిప్రాయాలపై వేగంగా స్పందించడమే కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. అర్హులైన కస్టమర్లకు ఆటో, ద్విచక్ర వాహన రుణాలను పూర్తిగా డిజిటల్‌గా అందిస్తూ 30 నిమిషాల్లో రుణ మంజూరు, ఖాతాలో జమ చేసే సదుపాయాన్ని బ్యాంక్ అందిస్తుందని తెలిపారు.

## ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యువరాజ్ మర్మత్ పర్యటన



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యువరాజ్ మర్మట్ గురువారం ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మండలం లోని బుర్గుడ,రెబ్బెన మండలంలోని తల్లాలపల్లి గ్రామాల్లోని పూర్వ ప్రాథమిక (ప్రీ-ప్రైమరీ) పాఠశాలలను ఆయన సందర్శించి, పరిశీలించారు. పాఠశాలల ఆవరణలో చేపడుతున్న సుందరీకరణ, రంగుల (పెయింటింగ్) పనులను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన వాతావరణంలో విద్యనందించేలా పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా అదనపు కలెక్టర్ పాఠశాల చిన్నారులతో సరదాగా మాట్లాడారు. వారి చదువు, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలతో ఆయన ఎంతో ఆప్యాయంగా ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, చిన్న పిల్లల ప్రాథమిక విద్య బలోపేతానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వ్యాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ శ్రీలక్ష్మి, రీజినల్ కోఆర్డినేటర్ బాలకృష్ణ



గట్టు సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. సంధ్యా కిరణ్మయి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ శ్రీలక్ష్మి, రీజినల్ కోఆర్డినేటర్ బాలకృష్ణ గురువారం గట్టు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, యూ-విన్ పోర్టల్‌లో వ్యాక్సినేషన్ ఎంట్రీలను పరిశీలించారు.యూ-విన్ పోర్టల్‌లో వ్యాక్సినేషన్ ఎంట్రీలపై డాక్టర్.టికే. రమేష్ సమక్షంలో సిబ్బందికి మార్గదర్శకత్వం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భౌతికంగ నిర్వహించిన ప్రతి వ్యాక్సినేషన్ వివరాలను అదే రోజు లేద వీలైనంత త్వరగ యూ-విన్‌లో నమోదు చేయాలని, పెండింగ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే డ్యూ లిస్ట్, వ్యాక్సినేషన్ రికార్డులు, యూ-విన్ వివరాలు పరస్పరం సరిపోలేలా చూడాలని సూచించారు. యూ-విన్‌లో ఎంట్రీల సమయంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, వ్యాక్సినేషన్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండ నిర్దేశిత సమయంలో మార్గదర్శకాలను పాటిస్తూ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని వారు తెలిపారు.

## కాజీపేట బస్ స్టేషన్ కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : ప్రయా ణికుల సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రతిపాదిత కాజీపేట శాశ్వత ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి రైల్వేకు సంబంధించిన ప్రతిపాదిత స్థలాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం పరిశీలించారు.ప్రస్తుతం సిటీ బస్సుల రాకపోకలు కొనసాగుతున్న రైల్వే స్టేషన్ ముందు ఉన్న స్థలాన్ని, రైల్వే పాఠశాల స్థలం, రైల్వే స్టేడియం ప్రాంతంతో పాటు, స్టేడియానికి ఎదురుగా ఉన్న రైల్వేకు చెందిన సుమారు ఎకరం భూమిని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాజీపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న హైదరాబాద్ కు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆగే బస్టాండ్ ను కలెక్టర్ పరిశీలించారు. కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద శాశ్వత బస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన రైల్వే శాఖ ద్వారా ప్రతిపాదిత భూమిని సమకూర్చుకోవడం, రైల్వే శాఖతో భూమి మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం, తదితర అంశాలను చర్చించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్‌ఎం భవానీ ప్రసాద్ , డిప్యూటీ ఆర్‌ఎం కిషన్ రావు, డిఎం ధరమ్ సింగ్, కాజీపేట తహసిల్దార్ రాజు, రైల్వే శాఖ ఇన్స్పెక్టర్ ఆఫ్ వర్క్స్ శ్రీనివాస్, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమ ద్వారా అధిక లాభాలు

- ఏఎస్‌ఓ లింగం





సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 10 : పట్టు పురుగుల పరిశ్రమ ఏర్పాటు ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని అసిస్టెంట్ సేరి కల్చరల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) లింగం అన్నారు.గురువారం రోజు మెదక్ జిల్లా,చిలిపిచెడు మండలంలోని గౌతాపూర్ గ్రామంలో రైతు బాబు సింగ్ ఏర్పాటు చేసిన పట్టు పురుగుల పరిశ్రమ ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు,సలహాలు ఇచ్చామన్నారు.రైతులు ఏర్పాటు చేసుకున్న 30 రోజులలో పట్టు పురుగులు గుళ్ళు అల్లుకుంటాయని ఆయన వెల్లడించారు. ఓక కేజీ పట్టు గుళ్ళ ధర రూ.రూ.600-800/- వరకు ఉంటుందని పేర్కొన్నారు. రైతులు జనగామ, సికింద్రాబాద్ తిరుమల గిరి ప్రాంతాల్లో విక్రయించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.పట్టు పురుగుల కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొనుటకు ప్రభుత్వం జనరల్ వారికి 50 శాతం,ఎస్సీ,ఎస్టీ లకు 65 శాతం వరకు సబ్సిడీలు ఇస్తుందని ఆయన చెప్పారు.రైతులు పట్టు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు.

# రుణ వసూళ్ల పేరుతో రాక్షసత్వం..!

- మైక్రో ఫైనాన్స్ మాఫియా ఆరాచకాలకు అడ్డుకట్టే లేదా..!
- మహిళల మానప్రాణాలతో చెలగాటం..
- వేధింపులపై భగ్గుమంటున్న ప్రజలు..!
- కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్..!!




మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : అత్యవసర అవసరాల కోసం చిన్న మొత్తాల్లో రుణాలు తీసుకున్న గ్రామీణ, పట్టణ పేద మహిళల పట్ల మైక్రో ఫైనాన్స్ కంపెనీల రికవరీ ఏజెంట్లు రాక్షసంగా ప్రవర్తిస్తున్నారు. కిస్తీ (ఈఎంఐ) చెల్లింపు కొద్ది రోజులు ఆలస్యమైతే చాలు, ఏజెంట్లు తమ పరిధులు దాటి అరాచకాలకు ఒడిగడుతున్నారు. కేవలం డబ్బు వసూలు చేయడమే కాకుండా, మహిళలను వ్యక్తిగతంగా, లైంగికంగా వేధించడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

### అప్పు తీర్చలేదని లొంగదీసుకునే ప్రయత్నాలు

క్రమం తప్పకుండా కిస్తీ లు కడుతున్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏదేని ఒక నెల ఆలస్యమైతే ఏజెంట్లు ఇళ్లకు వచ్చి అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. రాత్రి వేళల్లో ఫోన్లు చేయడం, ఇంట్లో పురుషులు లేని సమయంలో వచ్చి వేధించడం, డబ్బులు లేకపోతే మా మాట వినాల అంటూ లొంగదీసుకునేందు కు కుట్రలు చేయడం వంటి భయాందోళనకరమైన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో పరువు పోతుందనే భయంతో చాలామంది బాధితులు మౌనంగా భరిస్తుండటాన్ని ఏజెంట్లు ఆసరాగా చేసుకుంటున్నారు.

### మానసిక ఒత్తిడిలో మహిళలు

ఏజెంట్ల వేధింపులు తట్టుకోలేక పలువురు మహిళలు తీవ్ర మానసిక కుంగుబాటు కు గురవుతున్నారు. ఇళ్ల ముందుకు వచ్చి బూతులు తిడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తుండటంతో కొందరు ఇల్లు వదిలి వెళ్తుండగా, మరికొందరు ఆత్మహత్యాయత్నాల కు ఒడిగడుతున్నారు.

### పోలీసులు, అధికారుల హెచ్చరిక

ఈ అక్రమాలపై బాధితులు, మహిళా సంఘాల నేతలు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించే రికవరీ ఏజెంట్ల పై మరియు వారిని నియమించిన ఫైనాన్స్ సంస్థలపై ఆర్‌బీఐ రూల్స్ ప్రకారం, ఐటీ చట్టం మరియు క్రిమినల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

### బాధితులకు సూచన

మైక్రో ఫైనాన్స్ ఏజెంట్లు ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే లేదా లైంగికంగా/మానసికంగా వేధిస్తే భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లో లేదా 112/100 లేదా సైబర్ క్రైమ్/మహిళా హెల్ప్‌లైన్ కు ఫిర్యాదు చేయాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు మహిళల పట్ల అనాగరికంగా ప్రవర్తించడం, వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని లొంగదీసుకోవడానికి ప్రయత్నించడం మరియు వారి మానప్రాణాలతో చెలగాటం ఆడటం చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఈ విధమైన మైక్రో వేధింపులపై చర్యలు తీసుకోవడానికి ఉన్న కారణాలు / చట్టపరమైన ఆధారాలు మరియు దీని ఆధారంగా రూపొందించిన వార్తా కథనం కింద ఇవ్వబడ్డాయి:

### ఏజెంట్ల పై చర్యలు తీసుకోవడానికి గల ప్రధాన కారణాలు & చట్టాలు

లైంగిక వేధింపులు & శీలానికి భంగం కలిగించడం (బి ఎన్ ఎస్ / ఐపిసి చట్టాలు): భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్): మహిళలను లొంగదీసుకోవాలని చూడటం, లైంగిక కోరికలు తీర్చాలని ఒత్తిడి చేయడం లేదా వారి శీలానికి భంగం కలిగించడం (గతంలో ఐపీసి సెక్షన్ 354, 509) కింద నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపవచ్చు.

### ఆర్‌బీఐ రికవరీ మార్గదర్శకాల తీవ్ర ఉల్లంఘన

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం రికవరీ ఏజెంట్లు మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడకూడదు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్యలోనే సంప్రదించాలి. రుణ గ్రహీతల ప్రైవేట్ జీవితంలోకి తొంగిచూడటం, వ్యక్తిగత విషయాలతో బెదిరించడం పూర్తి నిషిద్ధం.

### బ్లాక్ మెయిలింగ్, బెదిరింపులు

ఇళ్ల ముందుకు వచ్చి రచ్చ చేయడం, పరువు తీస్తామని బెదిరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం చట్టపరమైన నేరం.వేధింపుల కారణంగా మహిళలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు తీసుకోవడానికి కారణమైతే ఏజెంట్లు మరియు సదరు మైక్రో ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులపై 'ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపణ' (బి ఎన్ ఎస్ 108 / ఐపీసీ 306) కింద కేసు నమోదు చేస్తారు.


# పేరుకే డిఇఓ డిప్టేషన్ ఆర్డర్... అమలు మాత్రం సున్నా!

- ప్రశ్నార్థకంగా మారిన పెంట్లవెల్లి, కొల్లాపూర్ మండలల విద్యార్థుల జీవితాలు?
- హెచ్ఎంల, అధికారుల నిర్లక్ష్యంతో నలిగిపోతున్న విద్యార్థుల భవిష్యత్తు
- నేటివరకు జటప్రోలు హైస్కూల్ కు రాణి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు?








The Mandal Educational Officers/Gazetted Head Master's of High Schools concerned are therefore instructed to relieve the individuals from their present schools and ensure their joining at the schools to which they are adjusted, as per the approved annexures.

The Mandal Educational Officers and School Complex H.M's shall ensure that the individuals are relieved and joined without delay and submit compliance report to this office.


The work adjustment shall be implemented strictly as per the approved proposals and applicable instructions.

Encl: Annexures

District Educational Officer, Nagarkurnool

To
The Headmasters / School Complex Headmasters concerned.
The Mandal Educational Officers in the district.
Copy submitted to the District Collector, Nagarkurnool.
Copy submitted to the DSE, TG, Hyderabad for favor of kind information.

కొల్లాపూర్ సెప్టెంబర్ 10:(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తూ, ప్రక్షాళనకు శ్రీకారం చుడుతుంటే... క్షేత్రస్థాయిలో మాత్రం జిల్లాస్థాయి మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు బాధ్యతారాహిత్యంగా విద్యాశాఖ ఆశయాలను నీరుగారుస్తున్నారని స్థానికులతో పాటు తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. గత నెల ఆగస్టు 7 తారీఖు రోజు నాగర్ కర్నూల్ డిఇఓ 153 మంది అదనంగా ఉన్న ఉపాధ్యాయులకు డిప్రెషన్ ఇస్తే కొందరు ఉపాధ్యాయులు మాత్రమే డి ఓ ఆర్డర్ ను గౌరవిస్తూ ఆర్డర్ పై రిలీవ్ పై వారికి ఇచ్చిన పాఠశాలలకు వెళ్లారని మిగతా కొందరు నేటికి కొల్లాపూర్ పెంట్లవెల్లి మండలాలకు చెందిన గాంధీ స్కూల్, కొల్లాపూర్ గర్ల్స్ హైస్కూల్ తో పాటు పెంట్లవెల్లి మండలంలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర జటప్రోలు హై స్కూల్ ల నుండి రిలీవ్ కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొల్లాపూర్ పెంట్లవెల్లి లలో ఇచ్చిన డిప్టేషన్ పాఠశాలలకు రిలీవ్ కాకుండా ఆ పాఠశాల హెడ్మాస్టర్లు వారికి హాజర్ వేస్తున్నట్లు స్థానికుల ఆరోపణలు వస్తున్నాయి. అలాంటి వారిపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





### డిఈఓ ఉత్తర్వులకు బుట్టదాఖలు

నాగర్ కర్నూల్ జిల్లా లో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈవో) ఇచ్చిన డిప్టేషన్ ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. సర్ ప్లస్ (అదనంగా) ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎంలు) అదనపు ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా డిప్టేషన్ ఆర్డర్ను పక్కన పడేస్తున్నారు. విచిత్రమేమిటంటే... డిప్టేషన్ ఆర్డర్లు వచ్చినప్పటికీ, పాత పాఠశాలల్లోనే సదరు ఉపాధ్యాయులకు హాజరు (అటెండెన్స్) వేస్తూ హెచ్ఎంలు చక్రం తిప్పుతున్నారు అని స్థానికుల విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### పత్రికల్లో కథనాలు వచ్చినా కదలని యంత్రాంగం

వార్తాపత్రికలలో డిప్టేషన్ ఆర్డర్ పై వార్త కథనాలు వచ్చిన పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు సాగడం లేదని, ఉపాధ్యాయుల కొరతతో పాఠశాలలు మూతపడే స్థితికి వచ్చాయని పలుమార్లు స్థానిక పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు కనీసం స్పందించకపోవడం గమనార్హం.? అధికారుల ఈ అచేతనత్వం వెనుక ఉన్న అంతర్యమేమిటో అర్థం కాక ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.




### విద్యార్థులకు ఓట్లు లేవనే కారణంతో ప్రజాప్రతినిధుల ఈ నిర్లక్ష్యమా?

రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో "ఓట్లు వేసే తల్లిదండ్రుల వద్దకు ఓట్ల కోసం వెళ్లే ప్రజాప్రతినిధులకు, పాఠశాలలో పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యనందక నలిగిపోతున్న పిల్లల భవిష్యత్తు కనిపించడం లేదా?" అని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితమవుతూ, విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

### ప్రభుత్వ ఆశయాలకు గండి కొడుతున్నది ఎవరు?

ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి జూపల్లి కొల్లాపూర్ నియోజక వర్గంలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చాలని, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రణాళికలు రచిస్తుంటే... క్షేత్రస్థాయిలో బాధ్యతలేని అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ఒత్తిళ్లకు తలొగ్గే హెచ్ఎంలు ప్రభుత్వ ఆశయాలకు గండికొడుతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, డిప్టేషన్ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయించి, కొరత ఉన్న పాఠశాలలకు పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

### ఈ విషయంపై కొల్లాపూర్ ఎంఈఓ వివరణ కోరగా

కొల్లాపూర్ మండల కేంద్రంలో ఉన్న గాంధీ హై స్కూల్ నుండి 5 మంది ఉపాధ్యాయులకు డీఈవో డిప్యూటేషన్ ఆర్డర్ ఇచ్చారని అందులో ముగ్గురు డిప్యూటేషన్ పై వెళ్లినట్లు పాఠశాల హెడ్ మాస్టర్ సమాచారం ఇచ్చారని ఇంకా ఇద్దరు వెళ్లలేదని అలాగే బాలికల ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ ఇస్తే అందులో ఒకరు డిప్టేషన్ పై వెళ్లినట్లు మరొకరు అనారోగ్యంతో ఉన్నట్లు పాఠశాల హెచ్ఎం తెలిపారని ఆయన అన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో డిప్టేషన్ ఆర్డర్లో వెళ్లే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

# !!..విజన్ ఆంధ్ర కథనంతో కదిలిన అధికారులు..!!

## మ్యాన్‌హోళ్ల ముప్పు నుంచి సంజీవయ్య నగర్‌కు ఊరట

- ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు తక్షణ మరమ్మతులు
- కొత్త మ్యాన్‌హోళ్ల నిర్మాణంతో వాహనదారులు, పాదచారులకు భరోసా
- మరికొన్ని కుంగిన మ్యాన్‌హోళ్లపై ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి









విజన్ ఆంధ్ర
09 Sep 2026 - Page 4

మ్యాన్‌హోళ్ల ముప్పులో సంజీవయ్య నగర్!

జీడిమెట్ల, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని సంజీవయ్య నగర్‌లో భూగర్భ డ్రైనేజీ మాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. చింతల్ నుంచి సుచిత్ర వెళ్లే ప్రధాన రహదారిలో పలుచోట్ల మాన్‌హోళ్లు కుంగిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంజీవయ్య నగర్‌లో దాదాపు మూడు మాన్‌హోళ్లు దెబ్బతిన్నా సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏఈ అభిరామ్ వివరణ

జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని సంజీవయ్యనగర్‌లో మ్యాన్‌హోళ్ల సమస్య మా దృష్టికి వచ్చింది. అక్కడ రెండు రకాల మ్యాన్‌హోళ్లు ఉన్నట్లు గుర్తించాం. చతురస్రాకారంలో ఉన్న మ్యాన్‌హోల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది. దీనిపై త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుని నిర్మాణ పనులు చేపడతాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు తలెత్తకుండా ప్రస్తుతానికి మ్యాన్‌హోల్ చుట్టూ చిన్న బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించాం. అయితే బ్యారికేడ్ల కారణంగా ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడుతున్నట్లు గమనించాం. అందువల్ల వీలైనంత త్వరగా శాశ్వత నిర్మాణ పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. అదేవిధంగా గుండ్రటి ఆకారంలో ఉన్న మ్యాన్‌హోల్ వాటర్ వర్క్స్ పరిధిలోకి వస్తుంది. ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ మ్యాన్‌హోల్‌కు కూడా త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

- అభిరామ్, అసిస్టెంట్ ఇంజనీర్, జీడిమెట్ల సర్కిల్

జీడిమెట్ల, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర): జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని చింతల్ నుంచి సుచిత్ర ప్రాంతానికి వెళ్లే ప్రధాన మార్గంలోని సంజీవయ్య నగర్‌లో ధ్వంసమైన మ్యాన్‌హోళ్లు స్థానికులు, వాహనదారులకు తీవ్ర ముప్పుగా మారిన విషయం తెలిసిందే. రహదారిపై మూడు మ్యాన్‌హోళ్ల నిర్మాణాలు దెబ్బతినడంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన లివిజన్ ఆంధ్ర దినపత్రికలి విలేఖరి ఇటీవల "మ్యాన్‌హోళ్ల ముప్పులో సంజీవయ్య నగర్" అనే శీర్షికతో కథనం ప్రచురించారు. దీంతో స్పందించిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీడిమెట్ల సర్కిల్ అధికారులు, వాటర్ బోర్డు అధికారులు సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టారు. ధ్వంసమై ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట నూతన మ్యాన్‌హోళ్లను నిర్మించారు. దీంతో గత కొన్ని రోజులుగా ప్రమాదభయంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. సంజీవయ్య నగర్ మీదుగా వెళ్లే ఈ రహదారి నిత్యం పాఠశాల బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలతో రద్దీగా ఉంటుంది. మ్యాన్‌హోళ్లు ధ్వంసం కావడంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రాత్రివేళల్లో గుంతలు, తెరుచుకున్న మ్యాన్‌హోళ్ల కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉండేది. పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే, విజన్ ఆంధ్రలో కథనం ప్రచురితమైన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన విజన్ ఆంధ్ర దినపత్రికకు, అలాగే సమస్యను పరిష్కరించిన సంబంధిత అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### మరికొన్ని మ్యాన్‌హోళ్లపై దృష్టి సారించాలి

ఇదిలా ఉండగా, ఇదే మార్గంలో మరికొన్ని మ్యాన్‌హోళ్లు కూడా కుంగిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం అవి పూర్తిగా ధ్వంసం కాకపోయినా, రహదారిపై నిత్యం భారీగా రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో ఎప్పుడైనా ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ మ్యాన్‌హోళ్లను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న వాటికి ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ముందుగానే చర్యలు తీసుకుంటే వాహనదారులు, పాదచారులను ప్రమాదాల బారి నుంచి కాపాడినవారవుతారని వారు పేర్కొన్నారు.

# మనోధైర్యమే.. జీవితానికి బలం

## మానసిక సమస్యలను దాచుకోవద్దు.. వైద్య సహాయం పొందాలి

## టెలీ-మానస్ 14416కు 24ఐ7 ఉచిత సేవలు: కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో): మానసిక ఒత్తిడి, సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఆత్మన్యూనతకు లోనుకాకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో టెలీ-మానస్ టోల్‌ఫ్రీ నెంబర్ 14416 పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణపై ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. మానసిక సమస్యలకు చికిత్స తీసుకోవడాన్ని కొందరు వెనుకాడుతున్నారని, సమస్యలను దాచుకోవడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో మానసిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, చికిత్స ఉచితంగా అందిస్తామని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆత్మహత్యల నివారణకు టెలీ-మానస్ 14416 ద్వారా 24 గంటలూ సేవలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స, మందులు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా మానసిక సమస్యలను నియంత్రించుకోవచ్చన్నారు. ఆత్మన్యూనత భావనతో బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజం అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నయీమా జహా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.